PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 144 | విజయవాడ, శుక్రవారం 26 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 26 December 2025 | Rs

సిరీస్ ఇక్కడే సాధించాలి

- నేడు భారత్, శ్రీలంక మహిళల మధ్య మూడో టి20
- రాత్రి 7.00గం॥ల నుంచి

3



స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటే పరిష్కార మార్గం 7

- క్రిస్మస్ సందేశంలో పోప్
- పాలస్తీనియన్ల దుస్థితి పట్ల తీవ్ర ఆవేదన

బెల్ట్‌కు మరో పేరే సబ్ లీజు!

గ్రామాల్లో ఇక మద్యం ప్రవాహమే..
అంతిమ లక్ష్యం ఆదాయం పెంపే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మద్యం అమ్మకాల్లో రాష్ట్రప్రభుత్వం కొత్తగా తెరపైకి తీసుకొస్తున్న సబ్ లీజు షాపులపై చర్చ ప్రారంభమైంది. ఇప్పటి వరకు అనధికారికంగా నడుస్తున్న బెల్ట్ షాపులకు మరో పేరే సబ్‌లీజ్ షాపులుగా కొంతమంది అధికారులు అభివర్ణిస్తున్నారు. ఈ కొత్త విధానం ఖజానాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకేనన్న భావాన్ని కూడా వారు వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే హర్యానా రాష్ట్రంలో ఈ విధానంపై అధ్యయనం చేసి రాష్ట్రంలోనూ అమలులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రయివేటు వ్యాపారులే మద్యం దుకాణాలు నడుపుతున్నారు. 2024-26 మద్యం పాలసీలో భాగంగా దాదాపు 3,700కు పైగా దుకాణాలు నడుస్తున్నాయి. అయితే అనధికారిక లెక్కల మేరకు ఇంతకు రెట్టింపు సంఖ్యలో బెల్ట్ దుకాణాలు కూడా గ్రామాల్లో నడుస్తున్నట్లు సమాచారం. తాజాగా అనేక మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లు కూడా ఇవ్వడంతో మద్యం విక్రయాలు ఊపందుకున్నాయి.



అదనపు ఆదాయం కోసమే..

ప్రస్తుతం హర్యానా రాష్ట్రంలో మద్యం సబ్ లీజ్ దుకాణాల విధానాన్ని అమలు చేస్తున్నారు. దీనివల్ల అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా ఆదాయం కూడా సమకూరుతోంది.

అందుకే ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. బెల్ట్ దుకాణాల ద్వారా బయట వారికి ఆదాయం వెళ్లిపోతోందని, సబ్ లీజ్ విధానం అమలు చేస్తే ఆ ఆదాయం కూడా ఖజానాకు వచ్చే అవకాశాలు ఉంటాయని అబ్కారీ అధికారులు భావిస్తున్నారు.

కొత్తగా అమలు చేయాలని భావిస్తున్న సబ్ లీజ్‌పై హర్యానా రాష్ట్రంలో పూర్తి స్థాయి అధ్యయనం చేసిన అనంతరమే రాష్ట్రంలో అమలుపై ఆలోచన చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న పాలసీ వచ్చే ఏడాది అక్టోబర్ వరకు అమలులో ఉంటుంది. అందుకే దీనిపై అన్ని కోణాల్లో అధ్యయనం చేసిన తరువాత వచ్చే ఏడాది మద్యం పాలసీలో సబ్ లీజ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

వాజ్‌పేయి హయాంలోనే పిపిపి

- అందులో భాగమే జాతీయ రహదారులు
- వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానమంటే ప్రైవేట్ కాదని, ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించి ప్రభుత్వానికి అప్పగిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం, స్మృతి వనాన్ని కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి అమరావతిలో గురువారం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ దేశంలో పిపిపి విధానం ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఆచరణలో చూపిన వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. అందులో భాగంగానే జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులను పిపిపి విధానంలో తీసుకొచ్చారని చెప్పారు. పిపిపి విధానం గురించి తెలియని వారు ప్రైవేట్ పరమంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు మోకాలడ్డుతున్నారని విమర్శించారు. ఈ విధానంలో నిర్మిస్తామంటే కొందరు జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై పరోక్షంగా విమర్శలు చేశారు. వాజ్‌పేయి లాంటి నాయకులతో రాజకీయం చేసి ఇప్పుడు చిల్లర వ్యక్తులతో రాజకీయం చేయటం సిగ్గు అనిపిస్తోందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ అభివృద్ధి యాత్ర ఆగదన్నారు. కేంద్రప్రభుత్వం కూడా పిపిపి విధానంపై సుముఖంగా ఉందన్నారు. దేశంలో కాంగ్రెస్ వ్యతిరేక భావజాలానికి బీజం వేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు. నేషనల్ ఫ్రంట్ ద్వారా కాంగ్రెసేతర పార్టీలను ఎన్‌టి రామారావు ఏకం చేశారని తెలిపారు. వాజ్‌పేయి, ఎన్టీఆర్ మధ్య సుదీర్ఘ అనుబంధం ఉందని చెప్పారు. త్వరలోనే ఎన్టీఆర్ స్మృతి వనం పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. నాడు వాజ్‌పేయి, నేడు నరేంద్రమోడీల వద్ద విశిష్ట లక్షణాలు ఉన్నాయని చెప్పారు. మోడీ అధికారంలోకి వచ్చాక 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 4వ స్థానానికి వచ్చిందని, 2047 నాటికి మొదటి స్థానంలోకి వస్తుందని అన్నారు. దేశంలో ఎపిని అగ్రభాగాన నిలబెట్టే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచామని, ఇంకా గేరు మార్చి వేగం పెంచుతామన్నారు. అనంతరం వాజ్‌పేయి చిత్రంతో కూడిన పోస్టల్ స్టాంప్‌ను శివరాజ్‌సింగ్‌తో కలిసి చంద్రబాబు ఆవిష్కరించారు.



వాజ్‌పేయి విగ్రహావిష్కరణలో శివరాజ్‌సింగ్, చంద్రబాబు, మంత్రులు పెమ్మసాని, నారాయణ తదితరులు

అమెరికా ఆంక్షలను పట్టించుకోని వాజ్‌పేయి : శివరాజ్‌సింగ్

అటల్ బిహారీ వాజ్‌పేయి అమెరికా ఆంక్షలు విధించినా పట్టించుకోలేదని పోఖ్రాన్ అణ్వాయుధ పరీక్షలు చేశారని కేంద్ర వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి శాఖలమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. వాజ్‌పేయి ప్రజాస్వామ్య మిగతా 7లో

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆరుగురు సజీవ దహనం • లారీ ఢీ కొట్టడంతో బస్సు ఆహుతి

బెంగళూరు : కర్ణాటకలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సజీవదహనం అయ్యారు. ఈ ఘటన చిత్రదుర్గ జిల్లా గోర్లత్త గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి బెంగళూరు నుండి గోకర్ణకు 30 మంది ప్రయాణికులతో సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరింది. చిత్రదుర్గ జిల్లా జాతీయ రహదారి-48పై వేకువజామున 2:30 గంటలకు హిరియుర్ తాలూకా గోర్లత్తు క్రాస్ వద్ద కంటేయినర్ లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును బలంగా ఢీ కోట్టింది. దీంతో డీజిల్ ట్యాంక్‌లో మంటలు చెలరేగి క్షణాల్లో బస్సుతో పాటు లారీకి కూడా మంటలు వ్యాపించాయి.. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు, లారీ డ్రైవర్ సజీవ దహనమయ్యారు. అయితే బస్సు డ్రైవర్, క్లీనర్‌తో సహా కొంత మంది ప్రయాణికులు అందులోంచి బయటకుదూకి ప్రాణాలు కాపాడుకున్నారు. వీరికి కొంత మంది స్థానికులు బస్సు అద్దాలు పగలకొట్టి సహాయమందించారు. ఘటన జరిగిన వెంటనే అక్కడకు చేరుకున్న ప్రభుత్వ అధికారులు క్షతగ్రాతులను చిత్రపురి, సిరా ప్రభుత్వ హాస్పటల్స్‌కు తరలించారు. పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలుస్తుంది. ఫైర్ సిబ్బంది మంటలను ఆపే ప్రయత్నం చేసినా అప్పటికే బస్సు అగ్నికి మిగతా 7లో



దగ్ధమవుతున్న బస్సు



10 నుంచి 18 వరకూ సంక్రాంతి సెలవులు

అమరావతి : జనవరి 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖరారు చేసినట్లు సంబంధిత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, విద్యాసంస్థలకు తొమ్మిది రోజులపాటు పండగ సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 19 నుంచి తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయని తెలిపారు.

భీమవరం డిఎస్‌పిపై బదిలీ వేటు

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎఫెక్ట్

ప్రజాశక్తి- భీమవరం టౌన్

పేకాట క్లబ్‌లు, సెటిల్‌మెంట్ల వ్యవహారంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న భీమవరం డిఎస్‌పి ఆర్.జయసూర్యపై బదిలీ వేటు పడింది. మంగళగిరిలోని హెడ్ క్వార్టర్స్‌కు ఆయనను అటాచ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థానంలో విఆర్‌లో ఉన్న రఘువీర్ విష్ణును డిఎస్‌పిగా నియమించింది. భీమవరంలో పేకాట క్లబ్‌లు, సెటిల్‌మెంట్ల వ్యవహారంలో డిఎస్‌పి జయసూర్య కీలక పాత్ర పోషిస్తున్నారని భీమవరానికి చెందిన కొంతమంది డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి గతంలో తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గత అక్టోబర్ 21న పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీకి ఆయన ఫోన్ చేశారు. డిఎస్‌పి జయసూర్య వ్యవహారంపై మాట్లాడి, ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తుండగా, తాజాగా డిఎస్‌పి జయసూర్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిఎస్‌పి జయసూర్యపై వచ్చిన ఆరోపణలపై జిల్లా ఎస్‌పి విచారించి రిపోర్ట్ ఇచ్చిన తర్వాతే ఈ బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. నగదు లావాదేవీల్లో తేడా రావడంతో ఓ ప్రజా ప్రతినిధి పేకాట క్లబ్‌లు, సెటిల్ మెంట్లతో చేస్తున్న దందాను డిఎస్‌పి అడ్డుకున్నారని, దీంతో ఆయన పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారనే ప్రచారంసాగుతోంది. అయితే, డిఎస్‌పి జయసూర్య మంచి అధికారి అంటూ తొలుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కితాబు ఇవ్వడం, జయసూర్యపై చర్యలు కాదు... ఆయన వెనుక ఉండి నడిపిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ డిమాండ్ చేయడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. డిఎస్‌పి విషయంలో పవన్ మాటే నెగ్గిందని, డిప్యూటీ స్పీకర్ రఘురామకు శృంగభంగం తప్పలేదని పలువురు ప్రస్తుతం చర్చించుకుంటున్నారు.



డిఎస్‌పి జయసూర్య

ఉద్యమ నేతపై పీడీ చట్టమా?

వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం • పలు జిల్లాల్లో నిరసనలు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

ప్రజాఉద్యమ నేత, అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజుపై పీడీ చట్టం బనాయించి, అరెస్ట్ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ తీరుపై పలు జిల్లాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రజలు ఎక్కడికక్కడ గురువారం ఆందోళనలు చేపట్టారు. గూండాలు, రౌడీషీటర్లు, ఆడ పిల్లలను అమానుషంగా కబళించే మానవ మృగాలపై సైతం పెట్టని ఈ చట్టాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే నేతపై బనాయించడాన్ని పలువురు తప్పుపట్టారు.

విశాఖలోని జగదాంబ జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అప్పలరాజును తక్షణం భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 20 సంవత్సరాల నుండి ప్రజల కోసం అప్పలరాజు ఎన్నో ఉద్యమాలు నిర్వహించారన్నారు. రైతు సమస్యలపై పోరాడారని తెలిపారు. అప్పలరాజుపై పెట్టిన 19 కేసుల్లో 13 కేసులను కోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ గంజాయి, ఎర్ర చందనం స్మగ్లర్ల మీద, భూ తగదాల్లో తలదూర్చి వేలాది కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వారిమీద, వైట్ కాలర్ నేరాలు చేసే వాళ్ల మీద పెట్టాల్సిన పీడీ చట్టాన్ని ప్రజా ఉద్యమాలు చేసే అప్పలరాజు మీద పెట్టడం అన్యాయమన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, హక్కులు లేవని గగ్గోలు పెట్టారని, అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు.



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

అనకాపల్లి జిల్లాలో...

అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు బృందావనం కాలనీలో నిరసన తెలిపారు. పేదల పక్షాన నిలబడ్డ ఆయనపై పెట్టిన తప్పుడు కేసులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో చోడవరం కొత్తూరు జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. కె.కోటపాడు మండలం సూరెడ్డి పాలెం గ్రామంలో ఎపి రైతు సంఘం మిగతా 2లో



అప్పలరాజు అరెస్టు బాధాకరం

- రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలించాలని కోరిన కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్. శర్మ

2

ప్రశ్నించేవారిపై పీడీ యాక్టు అప్రజాస్వామికం

- పలువురు సీనియర్ న్యాయవాదుల ఆగ్రహం



ఒడిశాలో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టులు మృతి
- వీరిలో అగ్రనేత గణేశ్ యుయికే కూడా..!
- ఆయన స్వస్థలం నల్గొండ జిల్లా
- ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం

5

రోడ్డెక్కిన శ్రీవారి యాత్రికులు

- తిరుమలలో వాహనాల అడ్డగింత
- శ్రీవాణి టికెట్ల కేటాయింపుల్లో గందరగోళం
- మరో 3 రోజులు టికెట్ల జారీ రద్దు : టిటిడి



శ్రీవాణి టికెట్ కౌంటర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవారి యాత్రికులు రోడ్డెక్కారు. తిరుమలలోని శ్రీవాణి టికెట్ల కోసం గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకే క్యూలైన్లలో యాత్రికులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ఐదు గంటలైనా కౌంటర్ తెరవకపోవడంతో ఒక్కసారిగా యాత్రికులు ఆందోళనకు దిగారు. రహదారిపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. టికెట్ కోసం రూ. 10,500 చెల్లిస్తున్నప్పటికీ యాత్రికుల పట్ల టిటిడి వ్యవహార శైలీ దారుణంగా ఉందని వాపోయారు. వణికిపోయే చలిలో పిల్లాపాపలతో క్యూలైన్లలో వేచి ఉన్నప్పటికీ కనీస సదుపాయాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాత్రికుల ఆందోళనతో టిటిడి అధికారులు అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రి రెండు గంటలకే శ్రీవాణి టికెట్లను జారీ చేశామని అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా యాత్రికులు భగ్గుమన్నారు. సరైన సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి క్యూలైన్లలో ఉంచడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడి భద్రతా సిబ్బంది యాత్రకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో యాత్రికులకు, భద్రతా సిబ్బందికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎన్ని గంటలకు టికెట్లు జారీ చేస్తారన్న కనీస సమాచారం కూడా యాత్రికులకు ఇవ్వకపోవడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మూడు రోజులపాటు శ్రీవాణి టికెట్లను ఇవ్వబోమని టిటిడి వెల్లడించింది. దీంతో చేసేదేమీ లేక యాత్రికులు తిరుమల నుంచి వెనుదిరిగారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

వరుస సెలవులు నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. శ్రీవారి దర్శనానికి దాదాపు 30 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు యాత్రికులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకూ యాత్రికులు వేచి ఉన్నారు.

అలిపిరిలో టోకెన్ల కోసం

అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శనం (ఎస్ఎస్‌డి) టోకెన్ల కోసం యాత్రికులు భారీగా తరలివచ్చారు. రోజువారీ కోటా 8000 టోకెన్లు పూర్తి అయినప్పటికీ యాత్రికుల రద్దీ కొనసాగింది. టోకెన్ల కోసం యాత్రికులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పోలీసులు, భద్రతా సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఎస్ఎస్‌డి కోటా పూర్తి అయ్యిందని, తిరుమలకు వెళ్లాలని అధికారులు చెప్పడంతో యాత్రికులందరూ తిరుమలకు పయనమయ్యారు. దీంతో అలిపిరి వద్ద వాహనాల రద్దీ పెరిగిపోయింది. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కొండపైకి అనుమతి ఇవ్వడంతో వందలాది వాహనాలు బారులు తీరాయి.



రాయ్‌పూర్‌లో క్రిస్టయన్లపై దాడి చేస్తున్న హిందుత్వవాదులు

రెచ్చిపోయిన హిందుత్వ శక్తులు

- క్రిస్మస్ వేళ క్రైస్తవులపై దాడులు
- అలంకరణలు ధ్వంసం.. వేడుకలకు అడ్డంకులు
- దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఘటనలు
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికం

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగను ఎంతో ప్రశాంతంగా జరుపుకుంటున్న వేళ భారత్‌లో మాత్రం సంఘ్ పరివార్ శక్తులు అలజడిని సృష్టించాయి. వివిధ ప్రాంతాల్లో క్రైస్తవులు, క్రిస్మస్ వేడుకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగాయి. పండుగరోజు వారి వేడుకలకు ఆటంకం కలిగించాయి. పలు హిందూ సంస్థలకు చెందిన కార్యకర్తలు ఈ ఘటనల్లో పాల్గొన్నారు. వేడుకలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి మరీ హింసాత్మక వాతావరణాన్ని సృష్టించారు. నిర్వాహకులు, పాల్గొన్న ప్రజలను బెదిరించారు. రెచ్చగొట్టే నినాదాలు చేశారు. తాజా ఘటనలతో దేశవ్యాప్తంగా క్రైస్తవ సమాజంలో భయాందోళనలు కలిగాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే ఈ ఘటనలు మిగతా 7లో

ప్రశ్నించేవారిపై పీడీ యాక్టు అప్రజాస్వామికం

- పలువురు సీనియర్ న్యాయవాదుల ఆగ్రహం
- అప్పలరాజు విషయంలో ప్రభుత్వానిది తప్పే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"ప్రభుత్వాలు అనుసరించే విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే వారు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. వారి ఇబ్బందులు ఏమిటో చర్చించి పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యత. ఇదేమీ చేయకుండా ప్రశ్నించిన వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పిడి) యాక్టు పెట్టడం పూర్తిగా అధికార దుర్వినియోగం. ఇటీవల హైకోర్టు కూడా పిడి యాక్టుపై తీవ్రంగా స్పందించింది. చాలా కేసుల్లో పోలీసులు దుర్వినియోగం చేసుకున్నారని తెలిపింది" అని పలువురు సీనియర్ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా రైతుసంఘం నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగించడం ముమ్మాటికీ తప్పేనన్నారు. సాంఘిక అరాచకాలు, దోపిడీలు, రౌడీయిజం, దొంగసారాయి కాయడం, గంజాయి అమ్మడం, సామాజిక సమూహానికి పదేపదే ఇబ్బంది కలిగిస్తే పీడీ యాక్టు ద్వారా సమాజానికి భద్రత కల్పించాలని, కానీ సమాజ రక్షణ కోసం ప్రశ్నించిన వ్యక్తులపై ఈ చట్టం ప్రయోగించడం దోపిడీదారులు, దొంగలను ప్రోత్సహించడమేనని వారు పేర్కొన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటూ కనీస గ్రామసభలు కూడా నిర్వహించకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభుత్వం, కార్పొరేట్లకు అండగా వస్తున్న పోలీసులను ప్రశ్నించిన వ్యక్తులను నోరు మూయించడం కోసం ఇటువంటి చట్టాలు ప్రయోగించడం తీవ్ర అప్రజాస్వామికమని, ఈ విషయంలో పోలీసులు కూడా తగుమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని న్యాయవాదులు హెచ్చరించారు. పీడీ యాక్టు ప్రయోగించాలంటే ముందు నోటీసు ఇచ్చి అభిప్రాయం తీసుకోవాలని, అంతకుముందున్న కేసులు ఏమిటి, సమాజానికి, జనసమూహానికి నష్టం కలిగించేవా, లేదా భూకబ్జా కేసులు ఏమైనా ఉన్నాయా అనేది తేల్చాలని అవేమీ లేకండా నేరుగా పీడీ యాక్టు పెట్టామని జైల్లోపెట్టడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

దోపిడీలు చేసేవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు
ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాదు



పీడీ యాక్టు అనేది భూకబ్జాదారులు, అక్రమాలు, మానవ అక్రమ రవాణాకు పాల్పడేవారు, నిరంతరం సమాజానికి ఇబ్బంది కలిగించేవారిపై ప్రయోగించేది. దాన్ని ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న వ్యక్తులపై పెట్టడం మానవ హక్కుల ఉల్లంఘనే.

ఒకవైపు గంజాయి వ్యాపారులు, హత్యలు చేసినవారు, దోపిడీదారులు రాష్ట్రంలో యథేచ్ఛగా తిరుగుతుంటే ప్రజల బాగుకోసం పనిచేసిన వ్యక్తులను జైల్లో పెట్టడం ఎంతవరకు న్యాయం? పేదలు భూములు అన్యాయంగా లాక్కుంటున్నారని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు దిగడం అప్రజాస్వామికం.

అధికార దుర్వినియోగం
పొత్తూరి సురేష్ కుమార్, సుప్రీం కోర్టు న్యాయవాది



అనకాపల్లి జిల్లాలో అప్పలరాజుపై ప్రజా ఉద్యమాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. వాటిల్లోనూ కొన్నిటిని కొట్టేశారు. అయినా రౌడీ షీట్ పెట్టి పీడీ యాక్టు ప్రయోగించారు. వాస్తవంగా అది సామాజిక దుర్మార్గాలకు పాల్పడే వారిపై ప్రయోగించేది. గూండాలపై పెట్టేకేసును ప్రజల తరుపున పోరాడే వారిపై పెట్టడం అప్రజాస్వామికం. ఉద్యమాలను అణచడం కోసం పీడీ యాక్టు ప్రయోగించడం తీవ్ర అధికార దుర్వినియోగం

హక్కుల కోసం పోరాడితే పీడీ యాక్టు అన్యాయం
మాధవరావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజల హక్కుల కోసం పోరాడేవారిపై పీడీ యాక్టు ప్రయోగించడం చట్ట విరుద్ధం. సమాజంలో లా అండ్ ఆర్డర్, పబ్లిక్ ఆర్డర్ ఉంటాయి. ఈ రెండింటికీ విఘాతం కలిగించడం అంటే రౌడీయిజం, అక్రమ దందాలు, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, భూకబ్జాలు ఇవన్నీ కూడా రెండు ఆర్డర్లనూ నాశనం చేసేవి. అటువంటివారిపై పీడీ యాక్టును ప్రయోగించి ప్రశాంతతను కల్పించాల్సిన సమయంలో పీడీ యాక్టు ప్రయోగిస్తారు. ఇక్కడ ప్రజలకు న్యాయం లేదని చెబుతున్న వ్యక్తులపై పీడీ యాక్టు ప్రయోగిస్తున్నారు. భూములు బలవంతంగా లాక్కుంటున్నారని అడిగితే బనాయిస్తున్నారు. అంటే ప్రభుత్వము, పోలీసులే ఆర్డర్లో లేరని అర్థమవుతోంది.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే డిటైన్ చేయడం అప్రజాస్వామికం
పిచ్చుక శ్రీనివాస్, ఎపిసిఆర్ అధ్యక్షులు



ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ప్రశ్నిస్తే, వారితో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి న్యాయం చేయాలి. అది రాజ్యాంగం. కానీ అన్యాయంగా భూములు లాక్కుం టున్నారని, ప్రజలకు ఇబ్బందులు పరిష్కరించాలని కోరే వారిపై పీడీ యాక్టు పెట్టడం అప్రజాస్వామికం. కార్పొరేట్ వ్యాపారులు, కంపెనీల కోసం భూములు లాక్కుంటూ పేదలను తరిమేస్తుంటే దాన్ని ప్రశ్నించారని డిటైన్ చట్టాన్ని ప్రయోగించడం ద్వారా కార్పొరేట్ల కోసం ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగిందని అర్థమవుతోంది. పీడీ యాక్టు విషయంలో హైకోర్టు అనేక సూచనలు ఇచ్చింది. వాటిని పోలీసులు అమలు చేయలేదు. అప్పలరాజుపై అంత కఠినమైన కేసులేమీ లేవు. అతనివల్ల సమాజానికి ఎటువంటి నష్టమూ జరగలేదు. పైగా ప్రజల తరుపున ప్రశ్నిస్తున్నారు. అటువంటి వ్యక్తిపై పీడీ యాక్టు పెట్టడం దుర్మార్గం.

అప్పలరాజుపై పీడీ చట్టం కేసు ఉపసంహరించాలి

- వెంటనే విడుదల చేయాలి
- 10 వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ చట్టం కేసును వెంటనే ఉపసంహరించాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని 10 వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాదు, ఎం.రామకృష్ణ, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి.బంగార్రావు, ఎస్‌యుసిఐసి నాయకులు అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పి.వి.సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు గురువారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై కృషిచేస్తున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అప్పలరాజు అరెస్టుకు ఇచ్చిన ఆర్డర్‌లో 2013 మే నుండి డిసెంబర్ 10, 2025 వరకు మొత్తం 19 కేసుల్లో నిందితునిగా పేర్కొన్నారని, అందులో రెండు కేసుల్లో నిర్దోషిగా తేల్చగా 12 కేసులు మూసివేశారని, మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని తెలిపారు. వీటిల్లోనూ అత్యధికభాగం 151 సెక్షన్ కేసులేనని పేర్కొన్నారు. ఆయన ప్రజల ప్రయోజనాలు, ముఖ్యంగా భూములు కోల్పోతున్న పేద రైతులు, అందునా అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారికోసం పోరాడారని తెలిపారు. వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే అప్పలరాజుపై దుర్బుద్ధితో అక్రమంగా పీడీ చట్టం పెట్టారని స్పష్టమవుతోందని వివరించారు. ఈ కేసులు పరిశీలిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ఇలా ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పలరాజు స్థానిక నిర్వాసితులు, బాధితుల పక్షాన నిలబడ్డారని విదితమవుతోందని వెల్లడించారు. ఫార్మా లాబీ, కార్పొరేట్ల కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడడం గర్హనీయమని తెలిపారు. కార్పొరేట్ల లాభాలకోసం సముద్రతీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్టప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఏ రకంగాను ఎవరిపైనా గూండాగిరి చేయలేదని పేర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి భూసేకరణకు అడ్డుపడేవారిపై పీడీ యాక్టు ప్రయోగించమని ఆదేశించారని, దీంతో కలెక్టర్ కనీసం ఆయనపై ఇప్పటి వరకున్న నేర చరిత్రను కూడా పరిశీలించకుండానే సంతకం పెట్టి ఆర్డర్ జారీ చేయడం అసమంజసమని తెలిపారు. తాజాగా సుప్రీంకోర్టు తెలంగాణాలో చట్టవిరుద్ధంగా పీడీ యాక్టు అనేకమందిపై ప్రయోగించడాన్ని తప్పుబడుతూ కొన్ని మార్గదర్శక సూత్రాలను కూడా విడుదల చేసిందనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. ప్రజలకోసం పనిచేస్తున్న అప్పలరాజుపై చట్టవిరుద్ధంగా బనాయించిన అక్రమ పీడీ చట్టం కేసును ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ప్రజలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, పార్టీలు, సంఘాలు, సంస్థలు ప్రభుత్వ నిర్బంధచర్యను ఖండించాలని, పీడీ యాక్టు కేసును ఉపసంహరించేలా ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు.



నెల్లూరులో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ



విశాఖ జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు లోకనాథం, నర్సింగరావు, జగ్గునాయుడు తదితరులు

ఉద్యమ నేతపై పీడీ చట్టమా?

మొదటి పేజీ తరువాయి : ఆధ్వర్యాన నిరసనకు దిగారు. రాంబిల్లి మండల కేంద్రంలోనూ, కోటవురట్ల మండలం అణుకులోనూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అల్లూరిజిల్లా డుంబ్రిగుడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారునిపై అక్రమ కేసులు తగవన్నారు.

నెల్లూరులో.... నెల్లూరులో గాంధీ బొమ్మ సెంటర్ నుండి విఆర్‌సి సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు తదితరులు ప్రసంగించారు. గంజాయి మూకల చేతిలో అత్యంత కిరాతకంగా హత్యకు గురైన ప్రజా ఉద్యమకారుడు పెంచలయ్య హత్యపై నేటికీ సిఎం, డిప్యూటీ సిఎం, రాష్ట్ర హోం శాఖ మంత్రి నోరు మెదపకపోవడాన్ని వీరు ప్రస్తావించారు. ఈ . కార్యక్రమానికి సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మూలి వెంగయ్య, ఎం.పుల్లయ్య, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరిలో... పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఉండి మెయిన్ సెంటర్ వద్ద ఆందోళనలో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలిపారు. ఇరగవరం, వీరవాసరం తదితర కేంద్రాల్లో ఆందోళనలు జరిగాయి.

అరెస్ట్‌కు ఖండన

మత్స్యకారుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై తీవ్రమైన నేరాలు (పిడి) యాక్ట్ కింద అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మికసంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. గత కొంతకాలంగా రాష్ట్రప్రభుత్వం బల్క్ డ్రగ్ పరిశ్రమ పేరుతో, పారిశ్రామిక కారిడార్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికంగా మత్స్యకారులు, రైతుల పోరాటానికి అప్పలరాజు తన వంతు మద్దతుగా ఉంటున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, కొల్లాటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బల్క్ డ్రగ్ పరిశ్రమ వల్ల వస్తున్న విషవాయువులు, మోలాసిస్ వల్ల భూమి, సముద్రపు నీరు కలుషితమై మత్స్య, వృక్షజాతులు నశించిపోయే ప్రమాదం ఉందని భవిష్యత్తులో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. అమాయక మత్స్యకారులు, రైతాంగం పక్షాన నిలవడమే నేరంగా భావించిన పోలీసులు, అక్రమ కేసులు బనాయించి అప్పలరాజును అరెస్ట్ చేసి జైలుకు పంపడాన్ని సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

అప్పలరాజు అరెస్ట్ బాధాకరం

- రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కోరిన కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - విశాఖపట్నం

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై నిర్బంధం విధించడం బాధాకరమైన చర్య అని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ తెలిపారు. స్థానిక ప్రజల తరపున కృషి చేస్తూ, వారి ఉద్దేశాలను జిల్లా అధికారుల దృష్టికి నిరంతరం తీసుకువెళ్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం అకస్మాత్తుగా నిర్బంధించిన విషయం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున: పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు గురువారం లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు శర్మ వివరించారు. నక్కపల్లి ప్రాంతంలో రసాయన పదార్థాలను ఉత్పత్తి చేస్తూ, చుట్టుపక్కల కాలుష్యం వెదజల్లిన కొన్ని పరిశ్రమల కారణంగా, స్థానిక జలవనరులకు నష్టం కలిగిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎన్నోసార్లు అధికారులను కలిసి, ఆ పరిశ్రమల కార్యకలాపాల మీద నియంత్రణ చేయడం అవసరమని విజ్ఞప్తి చేసినా వారి పట్ల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బాధితులు వారి వ్యతిరేకతను తెలియజేశారని, వారి ఉద్దేశాలతో ఏకీభవించి వారికి తోడునీడగా అప్పలరాజు నిలబడ్డారని తెలిపారు. అలా నిలబడటం ఏ చట్టం కింద నిషేధించబడిందో ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని కోరారు. నక్కపల్లి ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటును స్థానిక ప్రజలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. పరవాడ ఫార్మాసిటీ, బ్రాండిక్స్, సెజ్‌లలో రోజు రోజుకూ పెరుగుతున్న ప్రమాదాల విషయం తెలియని వారు లేరని, ఆ ప్రమాదాల్లో ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ప్రమాదం జరిగిన ఒక స్థానిక రసాయన పరిశ్రమను కొన్ని నెలల క్రితం సందర్శించి, బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలియజేయడాన్ని ప్రజలు హర్షించారన్నారు. బల్క్ డ్రగ్స్ పరిశ్రమ కూడా అటువంటి పరిశ్రమే అని ప్రభుత్వం గుర్తెరగాలని పేర్కొన్నారు. ఆ పరిశ్రమ పట్ల వ్యతిరేకత వ్యక్తం చేసే వారి మీద చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు హాని కలిగించడమే అవుతుందన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా దానికి సమీపంలోని అనకాపల్లిలో ఒక ప్రైవేట్ స్టీల్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా భూములు సమర్పించడం ఎంత వరకూ సబబు అని ప్రశ్నించారు. స్థానిక మత్స్యకారులకు నష్టం కలిగించే ఒక పోర్టును కూడా ప్రసాదించి, ఆ ప్రయివేటు కంపెనీ పట్ల వ్యామోహం చూపించిన సందర్భంగా స్థానిక ప్రజలు వ్యతిరేకత చూపడం సహజమైన విషయమన్నారు. అటువంటి స్థానిక ప్రజలకు అండదండగా నిలవడం, ఏ చట్టం కింద నిషేధించబడిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ఎన్నుకోబడ్డ రాజకీయ నేతలు ప్రజాస్వామ్య విధానాలను కించపరచడం, శాంతియుతంగా ప్రజాస్వామ్య విధానాలకు అనుగుణంగా వ్యతిరేకత వ్యక్తం చేసే వారి మీద చర్యలు తీసుకోవడం సబబు కాదన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని అప్పలరాజు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కోరారు.

అప్పలరాజు మా గళం.. నొక్కాలని చూస్తే ఊరుకోం

- రాజయ్యపేట, ధర్మవరం వాసుల మనోగతం

ప్రజాశక్తి- నక్కపల్లి, ఎస్.రాయవరం (అనకాపల్లి)

రైతు ఉద్యమ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పీడీ చట్టం ప్రయోగించి అరెస్టు చేయడాన్ని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వాసులు తీవ్రంగా ఖండిస్తున్నారు. నక్కపల్లి ప్రాంతంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం వందలాది ఎకరాల భూమిని సేకరించింది. ఆ సమయంలో భూ బాధితుల తరఫున అప్పలరాజు నిలబడ్డారు. రైతులు, నిర్వాసితులు పక్షాన ప్రశ్నించారు. ప్రమాదకరమైన బల్క్ డ్రగ్ పార్కును రాజయ్యపేట వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా ప్రజలు, మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకించి, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేసినా, సమస్య పరిష్కారం కాలేదు. ప్రజలు ఉద్యమ బాట పట్టారు. వారి ఆందోళనలు, ధర్నాలకు అప్పలరాజు సిపిఎం తరఫున పూర్తి సంఘీభావం తెలిపి ప్రజల పక్షాన గళమెత్తారు. నిర్వాసితులు, రైతులు, వివిధ వృత్తిదారుల విశ్వాసాన్ని చూరగొన్నారు. తమ పక్షాన నిలిచిన అప్పలరాజుపై ప్రభుత్వం పీడీ చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయడం పట్ల ఈ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల గళాన్ని అణగదొక్కాలని చూడడం సరైన పద్ధతి కాదని చెబుతున్నారు. అప్పలరాజు అరెస్టుపై ఆయన స్వప్రాంతమైన ఎస్.రాయవరం మండలం ధర్మవరం వాసులూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలపై పనిచేసిన అప్పలరాజును విశాఖ సెంట్రల్ జైలుకు తరలించడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి అప్పలరాజుపై ప్రభుత్వ కుట్రలు సాగుతున్నాయని తెలిపారు. రాజకీయ కుట్రలు ప్రజా ఉద్యమాలను ఆపలేవని ఆ గ్రామస్తులు తేల్చి చెబుతున్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి చౌహాన్‌ను కోరిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయం, అనుబంధ రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించేలా కేంద్రం మరింతగా సహకరించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా ఉండవల్లి సిఎం క్యాంపు కార్యాలయానికి గురువారం వచ్చిన కేంద్ర మంత్రికి ఈ మేరకు సిఎం వినతి పత్రాన్ని అందజేశారు. కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డుతో సహా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. పునర్విభజన చట్టం 2014, షెడ్యూల్ 13లో పేర్కొన్న విధంగా కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రూ.2,585 కోట్లు అంచనాలతో డిపిఆర్‌ను వ్యవసాయ పరిశోధన, విద్య విభాగానికి సమర్పించినట్లు మంత్రికి సిఎం వివరించారు. మరోవైపు రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అన్నదాత సంక్షేమానికి తీసుకున్న చర్యలను, అనుసరిస్తున్న విధానాలను కేంద్ర మంత్రికి సిఎం వివరించారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు వినతిని అందిస్తున్న సిఎం

పిఎం ఆర్కేవివై-పిడిఎంసి పథకంలో భాగంగా సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలని కోరారు. అరటి పంట రవాణాలో నష్టాలను తగ్గించేందుకు, మార్కెట్ యాక్సెస్ పెంచేందుకు రైల్వే వ్యాగన్ల ద్వారా అరటి రవాణాకు సబ్సిడీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అంచనా వ్యయంతో కొబ్బరి పార్కు ఏర్పాటు, పట్టు పురుగుల పెంపకం షెడ్లకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి నూతన ఉపాధి పథకం కింద సాయం, ప్రకృతి సాగులో శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత, పిఎం ప్రణామ్ నిధుల విడుదల వేగవంతం, ఎన్ఎంఎన్ఎఫ్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10 వేల సహజ సాగు క్లస్టర్లకు అనుమతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన 5 వేల క్లస్టర్ల నిర్వహణ ఖర్చు కేంద్రమే భరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది రైతులు సహజ సాగు అమలు చేస్తున్న నేపథ్యంలో, వచ్చే ఐదేళ్లలో 20 వేల అదనపు క్లస్టర్లను కేటాయించాలన్నారు. రాష్ట్రాన్ని సహజ సాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలని, విజయవాడ, అమరావతిలో అత్యాధునిక ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేయాలని, పులికాట్ సరస్సు అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చాలని కోరారు.



తల్లి పాడెను మోస్తున్న 'ప్రజాశక్తి' సబ్ ఎడిటర్ అంగేరి దివ్య

సిపిఎం నాయకులు పుల్లయ్యకు సతీవియోగం

- పలువురి సంతాపం
- పాడె మోసిన కూతుళ్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

తిరుపతి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్యకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య అంగేరి మునెమ్మ (54) రాజీవ్ నగర్‌లోని స్వగృహంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. శ్రీకాళాహస్తిలో స్వర్ణముఖి నది వద్దనున్న స్మశాన వాటికలో మునెమ్మ అంత్యక్రియలు జరిగాయి. ముందుగా మునెమ్మ మృతదేహంపై ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు.



అంగేరి మునెమ్మ (ఫైల్)

సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సిపిఎం శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి గంధం మణి తదితరులు నివాళులు అర్పించారు. మునెమ్మ ఐద్వా పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించారని వందవాసి నాగరాజు గుర్తు చేశారు.

పాడె మోసిన కూతుళ్లు

మునెమ్మ పాడెను తండ్రి అంగేరి పుల్లయ్యతో కలిసి ముగ్గురు కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు మోశారు. పెద్ద కుమార్తె దివ్య, రెండో కుమార్తె హేమలత, మూడో కుమార్తె వాణిలు తల్లి పాడెను మోస్తూ విప్లవ నినాదాలు చేశారు. పెద్ద కుమార్తె దివ్య 'ప్రజాశక్తి'లో సీనియర్ సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త వాడ గంగరాజు సిపిఎం చిత్తూరు జిల్లా కన్వీనర్‌గా ఉన్నారు. మునెమ్మ మృతదేహానికి ప్రజాశక్తి మేనేజర్, బ్యూరో ఇన్‌ఛార్జ్, డెస్క్ ఇన్‌ఛార్జ్, జిల్లా ఇన్‌ఛార్జ్‌లు నివాళులర్పించారు.

ఒంగోలు జాతి ఎడ్ల పందేలు ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఒంగోలు జాతి వృషభరాజముల ఎడ్ల అందాలు, బలప్రదర్శన జాతీయ స్థాయి పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయ. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు అమెరికా వరకు విస్తరించినా మనరాష్ట్రంలో మాత్రం వాటికి ఆదరణ తగ్గడం బాధాకరమని అన్నారు. ఒంగోలు జాతి పశుసంపదను, సంస్కృతిని కాపాడుకోవడంలో ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీల వల్ల వాటి పెంపకంపై రైతులకూ ఆసక్తి పెరుగుతుందన్నారు. ఒకప్పుడు పశువుల మేతకు ప్రతి గ్రామంలో పశ్చికబయళ్లు ఉండేవని, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో యాంత్రీకీకరణతో పశు గ్రాసం కొరత నేపథ్యంలో ఒంగోలు జాతి పశుపోషణకు రైతులు దూరమవుతున్నారని అన్నారు. ఒంగోలు జాతి పశుసంపదను కాపాడుకోకుంటే భావితరాలు వాటి గురించి పుస్తకాల్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన దేశ సంస్కృతిలో భాగమైన, పశు సంపదను పెంచి పోషించుకోవడం కోసం ఐదురోజుల పాటు ఈ పోటీల నిర్వహణ అభినందనీయమన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఒంగోలు గిత్తల బల ప్రదర్శనను ప్రజలు ఉత్సాహంగా వీక్షించారు. పాల పళ్ల విభాగంలో 25 జతలు తలపడగా గెలిచిన ఎడ్లజతల యజమానులకు బహుమతులు అందజేశారు. టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వేములపల్లి నర్సయ్య, నాగసరపు సుబ్బరాయ గుప్తా, నరసరావుపేట మండల రైతు ప్రధాన కార్యదర్శి మద్దుకూరి బ్రహ్మయ్య, కడియాల తాండవకృష్ణ, కూరపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



పోటీల్లో ఎడ్ల బలప్రదర్శన

సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు

- మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంక్రాంతి నాటికి రహదారులను గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్థన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు జిల్లాల్లో మొత్తం 10,880 కిలోమీటర్ల పొడవైన రహదారులు ఉన్నాయని, వీటిని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని అన్నారు. 1,775 కిలోమీటర్ల రహదారులకు మంజూరైన పనులను జూన్ 2026 నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గుంతల రహిత రహదారుల పనులు, ఇతర పునరుద్ధరణ పనులకు సంబంధించి అన్ని బిల్లులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రితోపాటు ఎపిఆర్‌డిసి ఎమ్‌డి శ్రీనివాసరెడ్డి, ఆర్ అండ్ బి ఇఆన్‌సి వివేకానందరెడ్డి, ఆయా జిల్లాల ఎస్ఇలు, డిఇలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

విజయవాడ కనకదుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్, స్థానాచార్య వి.శివప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మ వారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

ముస్తాబు

బడికి వెళ్ళేబాబు
ముస్తాబు చేసుకో
అద్దాన్ని చూసుకొని
అందంగ దువ్వుకో
అద్దంలో నిను చూసి
హాయిగా నవ్వుకో

బడికి వెళ్ళె పాప
ముస్తాబు చేసుకో
బొట్టు, కాటుక పెట్టి
పౌడర్ని రాసుకో
తలను నున్నగ దువ్వి
జడలల్లి పెట్టుకో
ఆత్మవిశ్వాసాన్ని
అది నీవు పెంచుకో
గోళ్ళు పెరిగాయంటె
అవి కత్తిరించుకో
జుట్టు నున్నగ దువ్వి
జట్టుగా మసలుకో
భోజనానికి ముందు
భోజనానంతరం
చేతులను సబ్బుతో
చక్కగా రుద్దుకో
పరిశుభ్రమైనట్టి



దుస్తులను వేసుకో
పరిసరాలను పాడు
చేయబోకండి
ఆరోగ్య భాగ్యాన్ని
సృష్టించరండి

- కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పదాలు ఇచ్చాం. వాటికి ఒకసారి లేక రెండు సార్లు 'ం' చేర్చితే అర్థవంతమైన పదాలు వస్తాయి. క్లూ ద్వారా మిగిలిన వాటిని మీరు ట్రై చేయండి.

అద	అందం
దత----	జయ ---
రగ ----	ఆనద ----
సగ ---	ఇధన ----
జగ ---	చదన ----
అహా ---	సత ---

నేను గీసిన బొమ్మ





- బందారం వేదశ్రీ,
8వ తరగతి,
జడ్పీ స్కూలు, రాంపూర్,
నిజాంపేట మండలం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉద్యోగ సాధనకు శారీరక శిక్షణ

'కుదిరితే పరిగెత్తు.. లేకపోతే నడువు... అదీ చేతకాకపోతే పాకుతూపో... అంతేగానీ ఒకేచోట అలా కదలకుండా ఉండిపోకు' అన్న స్ఫూర్తి వాక్యాలను అక్షరాలా నిజం చేస్తున్నారు కోడూరి సుధాకర్. ఎందరో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాడు. యుక్త వయస్సులో కఠోర సాధన చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చునని ఆచరణలో నిరూపిస్తున్నారు.

ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన కోడూరి లక్ష్మణరావు, కుమారి దంపతుల కుమారుడే సుధాకర్. అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన ఆయన భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలు కన్నారు. అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రమంలో అయిన గాయంతో కొంతకాలం ఇబ్బందిపడ్డారు. ఆ తర్వాత కోలుకుని పలు ఉద్యోగాల్లో చేరారు. అనుకోని పరిస్థితుల్లో తనలాగా ప్రయత్నాన్ని విరమించుకోకుండా దేశ సేవ కోసం తహతహలాడే యువత కోసం ఆయన వారి కలల సాకారానికి అవసరమైన శిక్షణ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ఆర్మీ, నేవీ, పోలీస్ వంటి వివిధ భాగాల్లో పరీక్షలకు హాజరయ్యే యువతకు కోచ్‌గా వ్యవహరిస్తూ సుమారు 200 మంది పోలీస్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, రైల్వే, ఆర్పీఎఫ్, బిఎస్‌ఎఫ్ విభాగాల్లో ఉద్యోగాలు పొందేలా చేశారు. ఇటీవల ఎపిఎస్‌పి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారిలో కొందరు ఈయన వద్ద శిక్షణ తీసుకున్న వారు కూడా ఉన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు...

ప్రతిభకు పేదరికం అడ్డు కాదని సుధాకర్ నిరూపించాడు. తనలాంటి యువతీ యువకుల కోసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫిజికల్ ఫిట్‌నెస్‌లో శిక్షణ ఇస్తూ ఎందరో యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. పోటీ పరీక్షల్లో ఉండే థియరీ రాతపరీక్ష, శరీర దారుఢ్య పరీక్షలకు అవసరమైన గైడెన్స్ అందజేస్తున్నారు. శరీర దారుఢ్య పరీక్షలో ఉత్తీర్ణత సాధించేలా సుధాకర్ ప్రతిరోజూ వందలాదిమందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలో ఉండే సమయాన్ని ప్రామాణికంగా తీసుకుని అంతకుముందు సమయంలోనే గమ్యం చేరుకునేలా ఈ శిక్షణ సాగుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవటం, శరీరం దృఢంగా ఉండటం, ప్రిపేరయ్యే పోస్టుల సాధనే లక్ష్యంగా అన్ని రకాల ఫిజికల్ ఫిట్‌నెస్ తరగతులను ఆయన బోధిస్తున్నారు.



పేద కుటుంబం నుంచి...

సుధాకర్ పాఠశాల స్థాయిలో ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ వంటి క్రీడల్లో ప్రతిభ కనబర్చేవాడు. తల్లి దండ్రులు, స్నేహితులు, గురువుల ప్రోత్సాహంతో తన పరుగుకు పదును పెట్టాడు. సరైన షూ లేకపోయినా ప్రాక్టీస్ చేశాడు. ప్రాథమిక విద్యాస్థాయి నుంచే క్రీడల్లో ముందుండేవాడు. డిగ్రీ వరకూ ఏ పోటీలో పాల్గొన్నా మంచి ప్రతిభ కనబర్చి పతకం సాధించేలా కృషిచేశాడు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో సత్తా చాటుతూ అనేక బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించాడు. కూలిపనిచేసే కుటుంబం నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై లక్ష్యం ఉంటే ఏదైనా సాధించొచ్చునని నిరూపించి అనేక మంది యువకులు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



ఉద్యోగ సాధనే లక్ష్యంగా శిక్షణ

జీవితంలో ఉన్నత శిఖరాలు సాధించాలంటే కష్టపడి పనిచేయాల్సిందే. నా వంతుగా నిరుద్యోగులకు వివిధ పోటీ పరీక్షలకు ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ ఇస్తున్నా. నా వద్ద శిక్షణ పొందిన వారు వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందటం ఆనందంగా ఉంది. కొందరు పోలీసు, రక్షణ రంగాల్లో ఉద్యోగాలు సాధించి దేశ భద్రతా విధుల్లో పనిచేస్తుండటం సంతోషంగా ఉంది.

- కోడూరి సుధాకర్
ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్, జోష్ అకాడమీ, విజయవాడ.

విద్యాభ్యాసం సాగిందిలా...

కోడూరు లక్ష్మణరావు, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడు సుధాకర్. పెద్దకుమారుడు ఎంఎస్‌సి చేశాడు. సుధాకర్ గ్రామంలోని హైస్కూలులో పదో తరగతి, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన అదే ప్రాంతంలోని ఛత్రపతి డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాడు. చదువుకునే రోజుల్లో స్నేహితులతో కలిసి వాలీబాల్, ఖోఖో, రన్నింగ్ ఆడేవాడు.

మూడేళ్లుగా నిరుద్యోగులకు శిక్షణ

ఉపాధి నిమిత్తం విజయవాడకు వచ్చిన ఆయన 'జోష్ ఫిజికల్ ఫిట్నెస్' పేరుతో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొంది ఆర్మీ, నేవీ, బిఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఎపిఎస్‌పి వంటి విభాగాల్లో ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు. సుధాకర తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఉద్యోగ సమాచారాన్ని తెలియజేస్తూ యువతకు మార్గదర్శనం చేస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, వాట్సాప్ : 83329 25496

సిరీస్ ఇక్కడే సాధించాలి

- నేడు భారత్, శ్రీలంక మహిళల మధ్య మూడో టి20
- రాత్రి 7.00గం॥ల నుంచి

తిరువనంతపురం: శ్రీలంక మహిళలతో విశాఖపట్నం వేదికగా జరిగిన తొలి రెండు టి20ల్లో ఘన విజయం సాధించిన భారతజట్టు ఇక సిరీస్‌పై దృష్టి సారించింది. ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు టి20ల్లో గెలిచి 2-0 ఆధిక్యతలో నిలిచిన భారత్.. మూడో టి20లోనూ గెలిస్తే సిరీస్‌ను కైవసం చేసుకోనుంది. ముఖ్యంగా రెండో టి20లో శ్రీలంక బ్యాటర్లు తొలుత రాణించినా.. ఆ తర్వాత స్పిన్నర్లు శ్రీచరణి, వైష్ణవి శర్మ లంక బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలీకృతులయ్యారు.



క్రిస్మస్ పండుగను టీమిండియా మహిళా క్రికెటర్లు ఘనంగా జరుపుకున్నారు. స్టార్ బ్యాటర్లు జెమీమా రోడ్రిగ్స్‌కి తోడు స్మృతి మంధాన శాంతాక్లాజ్ ధరించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.



తిరువనంతపురం చేరుకున్న మహిళా క్రికెటర్లు

దీంతో ఆ జట్టు ఒక దశలో భారీస్కోర్ దిశగా పయనించినా.. ఆ తర్వాత కేవలం 128 పరుగులకే పరిమితమైంది. ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌ను చేజిక్కించుకున్న అనంతరం భారత మహిళలజట్టు బలీయంగా మారింది. శ్రీలంకతో జరిగిన తొలి రెండు టి20ల్లో అటు బంతి, ఇటు బ్యాట్‌తో సమిష్టిగా రాణించింది. దీంతో ఆ జట్టును తొలి రెండు టి20ల్లో కేవలం 130 పరుగుల్లోపే పరిమితం చేయడంలో సఫలమైంది. శ్రీలంకపై భారత మహిళలు వరుసగా 9సార్లు విజయం సాధించారు. చివరిసారిగా 2024 జులై నుంచి భారతజట్టు లంక చేతిలో ఓడిన దాఖలాలు లేవు.

టి20ల్లో కొత్తగా అరంగేట్రం చేసిన జెమీమా రోడ్రిగ్స్ తొలి రెండు మ్యాచుల్లో గొప్పగా బ్యాటింగ్ చేసింది. మరోవైపు షెఫాలీ వర్మ కూడా రెండో టి20లో అర్ధ సెంచరీతో మెరిసి ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. అలాగే బౌలింగ్ విభాగంలో తొలి మ్యాచ్‌లో 6, రెండో మ్యాచ్‌లో ఏకంగా 9వికెట్లను కూల్చి లంకను కట్టడి చేయడంలో సఫలీకృతులయ్యారు. శ్రీచరణి, వైష్ణవి శర్మకు తోడు క్రాంతి గౌడ్ లంక బ్యాటర్లను కట్టడి చేశారు.

జట్లు(అంచనా)...

భారత మహిళలు : హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన, షెఫాలీ వర్మ, రోడ్రిగ్స్, రిచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, శ్రీచరణి.

శ్రీలంక మహిళలు : ఆటపట్టు(కెప్టెన్), గుణరత్నే, పెరీరా, సమరవిక్రమ, నీలాక్షి డి-సిల్వ, కవిషా దిల్హారి, కౌశని సత్యంగణా(వికెట్ కీపర్), ఇనోకా రణవీర, మాధర, కావ్య కావింది, శశినీ గిమ్హా.

గిరిజనులను నేరస్తులుగా చిత్రీకరణ!

- పంట ధ్వంసం, ఆదివాసీలను రక్తం వచ్చేటట్టు కొట్టిన సాక్ష్యాలు కళ్లెదుటే
- అయినప్పటికీ 20 మంది గిరిజనులపై కేసులు
- నిబంధనలకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారుల తీరు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలో జరిగిన ఘటనలో గిరిజనులను నేరస్తుల్లా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నాయి. అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై వారిని ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. 13 మంది పురుషులు, ఏడుగురు మహిళలు మొత్తం 20 మంది గిరిజనులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం ఇందుకు తాతార్కణం. గిరిజనులు కష్టపడి సాగు చేసుకున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి, అడ్డుకున్న గిరిజన యువకులను రక్తం వచ్చేటట్లు చావచితక బాదిన రెవెన్యూ, పోలీసు అధికారులది ఏ తప్పు లేనట్లు మాట్లాడుతున్న తీరు అత్యంత దారుణం. తహశీల్దార్ చలపతిరావును వెనకేసుకొస్తూ రెవెన్యూ అసోసియేషన్ మాట్లాడడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనులకు అన్యాయం చేస్తూ నిబంధనలను ఉల్లంఘించి రెవెన్యూ అధికారులు చేస్తున్న తప్పులపై ఇప్పటి వరకూ నోరు మెదపకుండా గిరిజనులను నేరస్తులుగా చిత్రీకరిస్తూ మాట్లాడడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. ఇనుమూరు గ్రామంలోని ఆర్ఎస్ నెంబర్ 221, 223, 210, 213, 217లో 47.77 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామంలోని 57 కుటుంబాలు ఈ భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటున్నాయి. ఈ భూమిపై వచ్చే పంటనే అక్కడి గిరిజనులకు జీవనాధారం. కొంతమంది గిరిజనేతర భూస్వాములతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆ భూములను వారిపేరున ఆన్‌లైన్‌లో మార్చేసినట్లు గిరిజనులు ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నారు. రికార్డుల్లో ఆ భూమి ప్రభుత్వ భూమిగానే ఉంది. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఆ భూములు గిరిజనులకే చెందుతాయి. రెవెన్యూ అధికారులు మాత్రం గిరిజనేతర భూస్వాములకు ఆ భూములు కట్టబెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రొటెక్షన్ ఆర్డరు ఇచ్చి పోలీసులతో గిరిజనులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే గత మంగళవారం బుట్టాయగూడెం తహశీల్దార్ పి.చలపతిరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు అనూహ్యంగా గ్రామాన్ని చుట్టుముట్టాయి. ట్రాక్టర్లను దింపి గిరిజనులు సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంటను దున్నించడం ప్రారంభించారు. ఎంతో కష్టపడి సాగుచేసిన పంటను ధ్వంసం చేస్తుండడంతో గిరిజనులు అడ్డుపడ్డారు. వారిని రక్తం వచ్చేటట్లు పోలీసులు కొట్టారు. మగ పోలీసులు మహిళలపైనా విక్షణారక్షితంగా దాడికి దిగారు. వీడియోల్లో ఈ ఘటనలన్నీ స్పష్టంగా కన్పిస్తున్నా తమ పంటను కాపాడుకునేందుకు ప్రతిఘటించిన గిరిజనులను నేరస్తుల్లా చిత్రీకరించి చూపుతున్నారు. తహశీల్దార్ చలపతిరావు ఫిర్యాదుతో 20 మంది గిరిజనులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టులు చేసి ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. రెవెన్యూ అధికారులు ఏజెన్సీ చట్టాలను పాటించారా? ప్రొటెక్షన్ ఆర్డర్లు ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు? పంటను ధ్వంసం చేయడం ఏ విధంగా సమర్థనీయం అనే వాటి గురించి ఏఒక్క అధికారీ మాట్లాడడం లేదు. గిరిజనులు ఏదో తప్పు చేసినట్లు మాట్లాడుతున్నారు. ఇదంతా గిరిజనేతర భూస్వాముల కనుసన్నల్లో అధికారులు చేస్తోన్న కుట్రగా చర్చ జరుగుతోంది. అమాయక గిరిజనుల పట్ల రెవెన్యూ అధికారులు చేస్తున్న తప్పుల గురించి ఎప్పుడూ నోరువిప్పని రెవెన్యూ అసోసియేషన్ నాయకులు... గిరిజనులపై కేసులు నమోదు చేసి శిక్షించాలని చెప్పడం విడ్డూరంగా ఉందనే చర్చ జరుగుతోంది. అధికారుల తీరును ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. గురువారం పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఇనుమూరు గ్రామానికి వెళ్లి ధ్వంసమైన పంటను పరిశీలించారు. మంగళవారం జరిగిన ఘటనలో పంటను దున్నేందుకు ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తెచ్చారు. గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



ఇనుమూరులో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని తీసుకొని వెళ్తున్న డిఎస్‌పి

నెదర్లాండ్స్‌తో డేవిస్ కప్‌కు
శ్రీరామ్ బాలాజీ స్థానంలో దక్షిణేశ్వర్


న్యూఢిల్లీ: నెదర్లాండ్స్‌తో జరిగే డేవిస్ కప్ టై మ్యాచ్‌కు శ్రీరామ్ బాలాజీని తొలగించినట్లు ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఎఐటిఎ) గురువారం ప్రకటించింది. ఎఐటిఎ తొలుత బాలాజీ పేరును ప్రకటించగా.. తాజాగా ప్రకటనలో అతని పేరును తొలగిస్తున్నట్లు తెలిపింది. దీంతో పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ-రుత్విక్ బొల్లేపల్లి బరిలో దిగనున్నారు. నెదర్లాండ్స్‌తో తొలిరౌండ్ క్వాలిఫయర్స్ టై ఫిబ్రవరి 7న బెంగళూరు వేదికగా జరగనుంది. భారతజట్టుకు సారథ్యం వహిస్తున్న సుమిత్ నాగల్ సింగిల్స్ బరిలో దిగుతున్నాడు. డబుల్స్ స్పెషలిస్టులు యూకీ బాంబ్రీతోపాటు దక్షిణేశ్వర్ సురేశ్, కరణ్ సింగ్ కూడా ఉన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే శ్రీరామ్ బాలాజీని తొలగించినట్లు ఎఐటిఎ తాజా ప్రకటనలో పేర్కొంది. ఈ విషయమై భారత కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ మాట్లాడుతూ.. యువ ఆటగాళ్లను ప్రోత్సహించాలనే దృష్టితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెదర్లాండ్స్‌తో టై కోసం ఎంపిక చేసిన జట్టులో రిజర్వు ఆటగాళ్లుగా ఆర్యన్ షా, ఎడమచేతి వాటం అనిరుధ్ చంద్రశేఖర్ మరియు దిగ్విజయ్ సింగ్ కూడా ఉన్నారు.



నాలుగేళ్ల తర్వాత రిచర్డుసన్‌కు చోటు

- నేటినుంచి ఇంగ్లండ్‌తో బాక్సింగ్ డే టెస్ట్

మెల్‌బోర్న్: ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య శుక్రవారం నుంచి బాక్సింగ్ డే టెస్ట్ ప్రారంభం కానుంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మూడు టెస్ట్ మ్యాచ్‌లను నెగ్గిన ఆసీస్ జట్టులో పేసర్ రిచర్డుసన్‌కు నాలుగేళ్ల తర్వాత తుదిజట్టులో చోటు లభించింది. ఇంగ్లండ్‌తో జరిగే నాల్గో టెస్ట్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) ప్రకటించిన 11మంది ఆటగాళ్ల జాబితాలో రిచర్డుసన్ ఒకరు. సిఎ ప్రకటించిన 12మంది ఆటగాళ్లలో నలుగురు పేసర్లకు చోటు లభించగా.. స్టీవ్ స్మిత్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. స్పిన్నర్ నాథన్ లియాన్ స్థానంలో టాడ్ మర్ఫీకి చోటు దక్కింది. రిచర్డు సన్ 2021లో చివరిసారి టెస్ట్ మ్యాచ్ ఆడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకొని దీర్ఘకాలం విశ్రాంతిలో ఉన్నాడు. తొలి రెండు టెస్ట్‌లు ఆడిన బ్రెండన్ డాగెట్, మైఖేల్ నెసర్‌లకు కూడా తుది 11మంది ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కింది. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ విశ్రాంతి తీసుకోవడంతో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో స్మిత్ హాజరయ్యాడు.



జట్టు: స్టీవ్ స్మిత్(కెప్టెన్), హెడ్, వెథర్లాండ్, లబూషేన్, ఖవాజా, క్యారీ(వికెట్ కీపర్), గ్రీన్, స్టార్క్, బోలండ్, డోగెట్, నెసెర్, రిచర్డుసన్.

క్రిస్మస్ వేడుకల్లో జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్ఆర్ కడప జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజు గురువారం క్రిస్మస్ వేడుకల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తన తల్లి వైఎస్.విజయమ్మ, భార్య వైఎస్.భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనా కూటమిలో ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా కూటముల అనంతరం చర్చిలో జగన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలని కోరారు. చర్చిలో తన వద్దకు వచ్చిన చిన్నారులను, మహిళలను జగన్ అప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, కడప, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాషా, కోరుముట్ల శ్రీనివాసులు, వైఎస్ కుటుంబ సభ్యులు, చర్చి పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ముగించుకున్న అనంతరం జగన్ బెంగళూరుకు చేరుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ సిఎం. వైఎస్.జగన్

మైక్రోసాఫ్ట్ డిస్కవరీతో హెచ్‌సిఎల్‌టెక్ జట్టు

న్యూఢిల్లీ : ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ సంస్థ హెచ్‌సిఎల్ టెక్ అధునాతన ఏజెంటిక్ ఎఐ ప్లాట్‌ఫామ్ అయిన 'మైక్రోసాఫ్ట్ డిస్కవరీ'లో చేరినట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఆర్కిటెక్చర్, భాగస్వామ్య సహకార నమూనాలను సమన్వయం చేయడానికి, ఉమ్మడి మార్కెట్ అవకాశాలను అన్వేషించడానికి మైక్రోసాఫ్ట్ డిస్కవరీ బృందంతో కలిసి హెచ్‌సిఎల్ టెక్ లోతైన సాంకేతిక ఆన్‌బోర్డింగ్ సెషన్లలో పాల్గొంటుందని పేర్కొంది. ఆన్‌బోర్డింగ్ తర్వాత హెచ్‌సిఎల్ టెక్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, డ్రగ్ డిస్కవరీ, సెమీకండక్టర్ డిజైన్ వంటి రంగాలలో పరిష్కారాలను వేగవంతం చేసే ప్రాజెక్టులలో పాల్గొంటుందని తెలిపింది.

సంపాదకీయం

ప్రజాకాంక్షపై నిర్బంధం

ప్రజల ఆకాంక్షలను వినిపించే గొంతుల మీద ఉక్కుపాదం మోపి, కార్పొరేట్ల సేవలో తరించాలని చూస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఎన్నికలకు ముందు ప్రజల పక్షంగా మాట్లాడి, తీరా గద్దెనెక్కాక వారికి వ్యతిరేకంగా వ్యవహరించటం టిడిపి కూటమి నేతల ద్వంద్వ వైఖరినే కాదు, మోసకారితనాన్ని కూడా బట్టబయలు చేస్తోంది. నెల్లూరు జిల్లా కరేడులో పంట భూములను ఇండోసోల్ కంపెనీకి అప్పగించబూనటం; అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పలుచోట్ల సోలార్ కంపెనీలకు భూపందేరాన్ని ప్రతిపాదించటం రైతుల్లో తీవ్ర కలవరాన్ని కలిగించింది. ఒక్కుమ్మడిగా కదిలి భూసేకరణను వ్యతిరేకించిన కరేడు రైతులపై ప్రభుత్వం తీవ్ర పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న రాజయ్యపేట గ్రామస్తుల పైనా ఆరు నెలల నుంచి తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తోంది. బల్క్‌డ్రగ్ పార్కు వద్దే వద్దని ప్రజలంతా ముక్తకంఠంతో అధికారుల ముందు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం తన పట్టు విడవకపోవటం దారుణం. ప్రజల ఆందోళనకు మద్దతుగా నిలుస్తున్న రైతుసంఘం నాయకుడు ఎం.అప్పలరాజుపై తాజాగా పీడీ యాక్టు బనాయించటం, ఉన్న ఫళాన సెంట్రల్ జైలుకు తరలించటం నిరంకుశత్వానికి పరాకాష్ట. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీలు, గూండాలపైనా; యువతను మాదకద్రవ్యాల్లో ముంచెత్తుతున్న ముఠాలపైనా వాడాల్సిన ముందస్తు నిర్బంధాన్ని ప్రజా నాయకుడిపై ప్రయోగించటం రాష్ట్ర ప్రభుత్వ దమననీతికి నిదర్శనం.

గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ గంజాయికి రాజధానిగా మారిందని విస్తృత ప్రచారం చేసిన టిడిపి కూటమి నేతలు- అధికారంలోకి వచ్చాక చేసిందేమిటి? గంజాయి, మాదక ద్రవ్యాల ఉనికి, వినియోగం తరచూ బయటపడుతున్నా, యువత భవిష్యత్తును ఉన్మాదపూరితంగా నిర్వీర్యం చేస్తున్నా సంబంధిత ముఠాలపై తీసుకున్న చర్యలేమిటి? నెల్లూరులో గంజాయి ముఠా బరితెగించి, ప్రజాకళాకారుడు పెంచలయ్యను హత్య చేసేదాకా అధికార యంత్రాంగం ఎందుకు ముందస్తు నిర్బంధానికి పూనుకోలేదు? నేర సామ్రాజ్యాన్ని నడుపుతున్న ముఠా నాయకి కామాక్షి తదితరులపై పీడీ యాక్టు ఎందుకు ప్రయోగించలేదు? రాష్ట్రంలో ఎంతమంది భూకబ్జాదారులపై ముందస్తు నిర్బంధ కేసులు నమోదు చేశారు? శాంతిభద్రతల పరిరక్షణ కోసం, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం వాడాల్సిన ఆయుధాన్ని ప్రజా ఉద్యమకారులపై వాడడం ఎవరి ప్రయోజనాల కోసం? పాలక పెద్దలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. తక్షణం ప్రజానాయకుడు అప్పలరాజుపై తప్పుడు కేసును ఉపసంహరించుకొని, బేషరతుగా విడుదల చేయాలి.

భూమిని భుక్తికి, ఉపాధికి మాత్రమే కాదు; ఉనికికి, గౌరవానికి సంకేతంగా చూస్తాడు రైతు. అలాంటి బలీయమైన బంధాన్ని ఉన్న ఫళాన ఊడబెరకాలని ప్రభుత్వాలు ప్రయత్నించటం తగదు. రాజధాని రైతుల తొలి విడత వితరణకే ఇప్పటివరకూ సరైన చెల్లింపులు, కేటాయింపులు జరగలేదన్నది ఆవేదన. రాజధానిలో కానీ, రాష్ట్రవ్యాప్తంగా కానీ సేకరించిన భూముల్లో అవసరమైన నిర్మాణాలు, పరిశ్రమల నిర్వహణ, ఉద్యోగ కల్పన చేపట్టకుండా - అదే పనిగా భూసేకరణకు తెగించటం, ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించటం వంటి చర్యల వల్ల ఉపయోగం లేదు. ఇది కార్పొరేట్లకు మేలు చేస్తుంది తప్ప రైతులకు, ప్రజలకూ ఎంతమాత్రమూ కాదు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్‌ఇజెడ్‌లకు, ఇతర ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతుల పరిస్థితి అన్ని విధాలా దుర్భరంగా ఉంది కాబట్టే- తాజా ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయం, ప్రతిఘటన తీవ్రంగా వ్యక్తమవుతోంది. ప్రజల అభిప్రాయాన్ని, ఆవేదనని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. బలవంతపు భూసేకరణ కోసం నిర్బంధ, నిరంకుశ చర్యలకు స్వస్తి చెప్పాలి. పరవాడ ఫార్మాసిటీ అనుభవాలు కళ్ల ముందు ఉన్నాయి కాబట్టి- బల్క్ డ్రగ్ పార్కుపై రాజయ్యపేట తదితర గ్రామాల ప్రజలు వినిపిస్తున్న అభిప్రాయానికి విలువనివ్వాలి. ప్రజా గొంతుకలను అణగదొక్కి, కార్పొరేట్లకు కొమ్ము కాసే రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధ వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

మహనీయుల మాట




ప్రజలు భూమి లాంటి వాళ్లు. కమ్యూనిస్టులమైన మనం విత్తనాల లాంటి వాళ్లం. మనం ఎక్కడకు వెళ్లినా... ప్రజలతో ఐక్యమవ్వాలి. ప్రజల్లో వేరూని, పెరిగి వారి మధ్యనే వికసించాలి.

- మావో జెడాంగ్, నాటి చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు



పడిపోయింది రూపాయి విలువ కాదు, ప్రభుత్వం విలువ!


విశ్లేషణ



ప్రొ॥ దేవరాజు మహారాజు

"రూపాయి పడిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా మంచిది"-అని సెలవిచ్చారు నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు. అందుకే కాబోలు దేశ ఆర్థిక మంత్రి సంతోషంగా ఉన్నారు. నిజమే మరి! ఆయన చెప్పిన లాజిక్కే అధికారంలో ఉన్న దేశ నాయకులంతా పాటిస్తున్నట్లుంది. కాలుష్యం ఆరోగ్యానికి మంచిదని చెప్పిన పర్యావరణ మంత్రి ఆనందంగా ఉన్నారు. ఢిల్లీతో పాటు దేశంలోని ప్రధాన నగరాలు కాలుష్యమయం అయిపోయినా, ఆయన నోరు విప్పడం లేదు. ఇండిగో విమానాల రద్దు దేశంలో పెద్ద సమస్యగా తయారైనా, విమాన శాఖా మంత్రి ఎంత సంతోషంగా ఉంటున్నారో చెప్పలేం. పైగా ఈయన తెలుగువాడు. మోడీ చంకలో చేరి, ఆయనకు ఊతమిచ్చి నిలబెట్టిన ఎన్డీఏ భాగస్వామి పార్టీ సభ్యుడు. ఈ దెబ్బతో తెలుగువారి ప్రతిభను ప్రపంచ వ్యాప్తం చేశాడు. తెలుగు దేశం పార్టీ సభ్యులే కాదు, తెలుగు వాళ్ళంతా చంకలు గుద్దుకుని ఎగిరి గంతేయాల్సిన సందర్భం! "బరువైన వస్తువులు వేగంగా కింద పడతాయి. అలాగే భారత దేశపు రూపాయి బరువుగా ఉంటుంది కనుక, త్వరత్వరగా కింద పడిపోతోంది". ఈ వ్యాఖ్య ప్రతిపక్షాల వారిది కాదు. స్వయానా అధికార పక్షం-బిజెపి ఎం.పి కంగనా రనౌత్ జీ అన్నదే! బిజెపి వారి పరువు తీయడానికి ప్రతిపక్ష సభ్యులు అవసరం లేదు. వాళ్ళ పరువు వారే తీసుకోగల సమర్థులు. ఇదిగో ఇలాంటి వాళ్ళకే పద్మశ్రీలు కూడా దక్కుతూ ఉంటాయి.

ఇక బిజెపి పూర్తి మెజారిటీతో గెలిచి, నరేంద్ర మోడీ ప్రధాని కావడంతో ఈ దేశ ప్రజలందరూ ఎంతో ఆశించారు. మంచి మెజారిటీతో గెలిచిన ప్రభుత్వం గనుక, చాలా మంచి పనులు చేస్తూ ప్రజారంజకమైన పరిపాలన అందిస్తారని ఆశించారు. కానీ, వారి ఆశ అడియాసే అయ్యింది. మోడీ ప్రభుత్వం ఆర్థిక రంగాన్నే కాదు, క్రమంగా అన్ని రంగాలనూ దిగజార్చుతూ వచ్చింది. నోట్ల రద్దుతో దేశానికి పెద్ద దెబ్బ తగిలింది. దాని ప్రభావంతో వందల మంది చనిపోయారు. ఒక రకంగా దేశ ఆర్థిక వ్యవస్థ అప్పుడే కుప్పగూలింది. ఆ తర్వాత జి.ఎస్.టి ఎప్పుడైతే ప్రవేశపెట్టారో అప్పుడు మధ్య స్థాయి, కింది స్థాయి పారిశ్రామిక రంగాలన్నీ మూల పడ్డాయి. లక్షల మంది ఉపాధి కోల్పోయారు. మళ్ళీ పుంజుకునే అవకాశం కూడా మోడీ ప్రభుత్వం ఆ పరిశ్రమలకు ఇవ్వలేదు.



> ఒక్క డాలర్‌కు 91 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇది ఇంకా ఇంకా పడిపోవచ్చని నిపుణులు చెప్తున్నారు. కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు మాత్రం 'దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంది' అని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రతి మనిషికి ఆత్మసాక్షి అనేది ఉంటుంది. బహుశా, ప్రస్తుత మన దేశ నాయకులకు అదంటే ఏమిటో కూడా తెలియనట్టుంది. డా॥మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొద్దిగా పడిపోయింది (సుమారు 53 రూపాయలు). అప్పుడు ఇదే మోడీజీ దాన్నొక పెద్ద సమస్యగా చిత్రించి నాటి ప్రభుత్వాన్ని నానా మాటలు అన్నారు. అప్పుడు కొద్దిగా పడిపోయిన దానికీ, ఇప్పుడు పూర్తిగా పడిపోయిన దానికీ పోలికే లేదు. గతంలో తను మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ చూసుకుని మోడీజీ నాలుక కరుచుకుని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్తారా?

ఇక కోవిడ్ సమయంలో దేశం మరింతగా కుప్పకూలింది. కూలి, నాలి జనానికి బస్సు, రైలు సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితికి ప్రభుత్వం దిగజారింది. పనికిరాని మాటలు తప్ప, స్థూలంగా దేశ పౌరులకు చేసింది ఏమీ లేదు. చెయ్యాల్సింది చేయకుండా చప్పట్లు చరచండి! పళ్ళాలు మోగించండని దేశ ప్రధాని పిలుపు నిచ్చారు. ఏళ్ళు గడుస్తున్నా, ఈ దేశ ప్రజలు ఇంకా చప్పట్లు చరిచి ప్లేట్లు మోగిస్తూనే ఉన్నారు. ఎందుకంటే - వారికి ఇంత తిండి పెట్టే నాథుడో, ఉపాధి కల్పించే యోధుడో వస్తాడేమోనని!

అమెరికా డాలర్ ముందు భారతదేశపు రూపాయి బక్కచిక్కిపోయింది. ఒక్క డాలర్‌కు 91 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇది ఇంకా ఇంకా పడిపోవచ్చని నిపుణులు చెప్తున్నారు. కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు మాత్రం 'దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంది' అని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రతి మనిషికి ఆత్మసాక్షి అనేది ఉంటుంది. బహుశా, ప్రస్తుత మన దేశ నాయకులకు అదంటే ఏమిటో కూడా తెలియనట్టుంది. డా॥మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొద్దిగా పడిపోయింది (సుమారు 53 రూపాయలు). అప్పుడు ఇదే మోడీజీ దాన్నొక పెద్ద సమస్యగా చిత్రించి నాటి ప్రభుత్వాన్ని నానా మాటలు అన్నారు. అప్పుడు కొద్దిగా పడిపోయిన దానికీ, ఇప్పుడు పూర్తిగా పడిపోయిన దానికీ పోలికే లేదు. గతంలో తను మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ చూసుకుని మోడీజీ నాలుక కరుచుకుని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్తారా? అసలంత హుందాగా ఆయన ఎప్పుడు ప్రవర్తించారనీ! పైగా ఆయన భక్తులేమో ఇక్కడ విషయాల్ని వక్రీకరించి చెప్తూ ఉంటారు. రూపాయి విలువ ఎంత పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థ అంత బలపడుతుందని వివరణలిస్తారు. ఆర్థిక రంగం గురించి ఏమాత్రం పరిజ్ఞానం లేని వారికైనా-అదొక మూర్ఖపు ప్రకటన అని తెలిసిపోవడం లేదా? రూపాయి విలువ ఇంతగా పడిపోతే అంతర్జాతీయ మార్కెట్లో నిలబడేదెట్లా? నిలదొక్కుకునేది తర్వాత సంగతి! తమ తమ అహాల్ని వదిలి ఆర్థికమంత్రి, ప్రధాని ఆర్థిక రంగ నిపుణుల్ని సంప్రదించాలి! పునరుద్ధరణకు పూనుకోవాలి! పన్నెండేళ్ళుగా అధికారంలో కొనసాగుతున్న ఈ ప్రభుత్వం, ఏ రంగం మీద దృష్టి పెట్టిందన్నది ఆత్మ విమర్శ చేసుకోవాలి!


దేశ ప్రజల కష్టార్జితమైన రూపాయికి విలువే లేదని విమానయాన సంస్థ కూడా ఈమధ్య రుజువు చేసింది కదా? 2025 డిసెంబర్ 4-8 తేదీల్లో వందల సంఖ్యలో విమానాలు రద్దయి వేల మంది ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. విమానాల రద్దు గురించి వారికి మెసేజో మెయిలో పంపలేదు. వేల మంది ప్రధాన నగరాల్లోని ఎయిర్ పోర్టులకు పోయి చివరి క్షణంలో విమానాలు రద్దయ్యాయన్న బోర్డులు చూసి నీరుగారిపోయారు. ఆ ప్రయాణాలు కొందరికి ఎంతో ముఖ్యమైనవి కావచ్చు. భావోద్వేగాలకు గురై కొందరు భోరుమని ఏడ్చారు. విమానాలు రద్దయినప్పుడు విమాన సంస్థ ప్రయాణికుల చార్జీలు వెంటనే వెనక్కి తిరిగి ఇచ్చేయాల్సింది. ఆ పని వారు చేయలేదు. విమానాశ్రయాల నిర్వహణ కుప్పగూలింది. టీ, డ్రింక్స్, స్నాక్స్ అందివ్వకపోవడం అలా ఉంచి - వాష్ రూమ్‌లు వాడకానికి పనికిరాకుండా అయ్యాయి. విమానయాన మంత్రిత్వశాఖ ఉంది. దానికీ మంత్రీ వున్నాడు. సంవత్సర కాలంగా ఇండిగో సంస్థ నిర్వహణ సరిగా లేక విమానాలు రద్దవుతుంటే కేంద్ర ప్రభుత్వమేం చేస్తోంది? డబ్బులు పోగొట్టుకొని ప్రయాణికులు అల్లలాడుతూ ఉంటే అక్కడేం జరిగిందీ? ప్రజల రూపాయికి విలువే లేదని తేలిపోయింది!!

2014 తర్వాత మోడీ ప్రధాని అయ్యాక పరిస్థితి మారింది. తనకు కావాల్సిన వారికి ఎక్కువ మేలు చేస్తూ వచ్చారు. వారినే బలపడనిచ్చారు. ఇప్పటి వివరాలు ఇలా ఉన్నాయి. ఇండిగో 65 శాతం అయితే, ఎయిర్ ఇండియా 18 నుండి 30 శాతానికి పెరిగింది. మిగతా సంస్థలు 5 శాతంలో ఉన్నాయి. ఇండిగోకు ఎక్కువ మేలు చేసిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నిబంధనలకు అనుగుణంగా పని చేయలేక పోతున్నా ఇండిగో తన గుత్తాధిపత్యం వదులుకోలేకపోతోంది. సంవత్సర కాలంగా సమస్యలు సృష్టిస్తున్నా భారత విమాన మంత్రిత్వ శాఖ చోద్యం చూస్తూ ఉంది. 2025 డిసెంబర్ నెల మొదటి రెండు వారాలు విమాన సర్వీసులు రద్దయి లక్షల మంది ప్రయాణికులు లబోదిబోమన్నారు. టికెట్ డబ్బులు వారివి వారికి వెంటనే తిరిగి ఇవ్వాలి కదా? అది కూడా చేయలేక పోయారు. దీనికి ప్రధాన కారణం మోడీ, షా, వారి మంత్రి వర్గ సహచరుడు-ఎన్డీఏ భాగస్వామి (తెలుగుదేశం) మంత్రి రామమోహన్ నాయుడి అసమర్థత! ఆంధ్ర రాష్ట్రంతో సంబంధమున్న ఆర్థికమంత్రి, విమానయాన మంత్రి తెలుగువారి పరువు ప్రపంచం ముందు ఏ మాత్రం మిగల్చలేదు.

ఇండిగో సంక్షోభంలో పడడంతో మిగతా ఎయిర్ లైన్స్ విమాన చార్జీలు ఉన్నఫళంగా 5-6 రెట్లు పెంచాయి. ఫలితంగా దగ్గరున్న విదేశాలకు అయ్యే చార్జి కంటే దేశంలో మరో నగరానికి వెళ్ళాలంటే ఎక్కువ చార్జి పెట్టాల్సి వచ్చింది. ఇంత ఘోరం జరుగుతూ ఉంటే, ఈ దేశానికి ఓ ప్రధాని, ఓ హోం మంత్రి ఉన్నారు కదా? వాళ్ళెందుకు నోరు మెదపలేదు? ముందు నిలబడి సహాయక చర్యలు చేపట్టడం తర్వాత సంగతి! ఇదీ ప్రస్తుతం దేశ పరిస్థితి. ఇక్కడ దేశంలో పెరిగిన ధరలూ, పన్నులూ చూసి, బతుకు భారమై పోవడం చూసి, ఉపాధి లేకపోవడం చూసి, స్వేచ్ఛ లేకపోవడం చూసి యువత ఎలాగోలా విదేశాలకు వెళ్ళిపోవాలనుకుంటోంది. ముందే వెళ్ళిపోయిన వారు తిరిగి రావడానికి సాహసించడం లేదు. ఇక్కడ 'జై శ్రీరామ్' అంటూ కూర్చుంటే కడుపు నిండే అవకాశం లేదు కదా? పాలకులు ఎంతసేపూ గల్లీల పేర్లు, ఊర్ల పేర్లు, నగరాల పేర్లు మార్చడమే గొప్ప సంస్కరణ అనుకుంటున్నారు. బెంగాల్ ఎన్నికలు వస్తున్నాయి గనక 'వందేమాతరం' గీతాన్ని వివాదాస్పదం చేసి పార్లమెంట్‌లో చర్చకు పెడతారు. దేశ ప్రజల సమస్యలు వీరికి కనపడవు. ఇవన్నీ గమనించే ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్ "కార్పొరేట్ దేశంగా, హిందూమత రాజ్యంగా, పోలీస్ రాజ్యంగా, భయపెట్టే దేశంగా మారిపోయింది" అని అన్నారు! "నఫరత్ కి బజార్ మె హం మొహబ్బత్‌కి దుకాన్ ఖోల్ తే జాయింగే"-విద్వేష పూరితమైన మీ వీధుల్లో మేం ప్రేమ దుకాణాలు తెరుస్తాం!-అన్నది కేవలం ప్రతిపక్ష నేత ఇచ్చిన నినాదం కాదు. అందులో ప్రతి భారతీయుడి గుండె కొట్టుకుంటోంది!

/ వ్యాసకర్త సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త /

'అతిథి దేవో భవ' ఆచరిస్తున్నామా?



కత్తిరింపులు

హిందీ తెలియనందుకు ఒక ఆఫ్రికా జాతీయుడిని అవమానించిన సంఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటు చేసుకుంది. విదేశాలకు వెళ్ళిన మన భారతీయులు కూడా ఇదే రీతిలో అవమానాలను ఎదుర్కొనడంపై ఆలోచించేలా చేసిందీ ఘటన.

మొఘలుల పాలనలో, బ్రిటీష్ వారి కాలంలో, ఇప్పుడు భారతీయుల హయాంలో, ఎప్పుడూ కూడా ఢిల్లీకి 'స్థానికవాదం' దురభిమానం నుండి మినహాయింపు లభిస్తూనే వచ్చింది. వలస వచ్చినవారికి, పాలనా యంత్రాంగానికి, వాణిజ్యానికి ఒక నగరంగా గుర్తింపు పొందుతూ వచ్చింది. పర్షియన్, ఉర్దూ, హిందీ, పంజాబీ, ఇంగ్లీషు...ఇలా అన్ని భాషలు ఇక్కడ పని చేసుకోవడానికి సరిపోతూ వచ్చాయి. ఈ నగరంపై ఏ ఒక్కరూ కూడా తమదే ఆధిపత్యమని చెప్పుకోవడానికి, చలాయించ డానికి ఎన్నడూ అవకాశం ఇవ్వలేదు. కానీ దీనికి భిన్నంగా రెండు వారాల క్రితం, ఒక పబ్లిక్ పార్క్‌లో బిజెపి కౌన్సిలర్ ఒకరు తన వ్యవహార శైలితో అందరి దృష్టిని ఆకర్షించేలా ఒక సీన్ సృష్టించారు. ఆ సంఘటన ఢిల్లీకి గల ఈ సాంస్కృతిక చరిత్రను దెబ్బతీసింది. పిల్లలకు ఫుట్‌బాల్ నేర్పుతున్న కోచ్‌ను ఆ మహిళా కౌన్సిలర్ బెదిరించారు. నెల రోజుల్లోగా అతను హిందీ నేర్చుకోకపోతే ఇక్కడ నుండి గెంటేస్తామన్నది ఆ బెదిరింపు సారాంశం. "ఇక్కడి డబ్బుతో బతుకుతున్నావు కాబట్టి ఈ దేశ మాతృభాష మాట్లాడాలి." అన్నది ఆమె హెచ్చరిక. ఇక్కడ ఆమె తర్కం లోపభూయిష్టంగా వుంది. అంతేకాదు, దేశంలోనే పలు ప్రాంతాలకు, అలాగే విదేశాలకు వలసలు వెళ్ళే లెక్కలేనంతమంది భారతీయుల మీద ఈ అర్థం లేని తప్పుడు లాజిక్‌ను వర్తింపచేస్తే పరిస్థితి ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకుంటే...భవిష్యత్ అంతా నిరాశాజనకంగా కనిపిస్తుంది.

నైపుణ్యాలు కలిగిన మన భారత వర్కర్లకు, విద్యార్థులకు అంతర్జాతీయంగా అపారమైన అవకాశాలు కొనసాగించేందుకు వీలయ్యేలా ఇక్కడ భారత దౌత్యవేత్తలు ద్వైపాక్షిక ఒప్పందాల సమయంలో చర్చా వేదికల వద్ద ఎంతో శ్రమపడుతూ వుంటారు. భారతీయ మైగ్రెంట్ల పట్ల మరింత పారదర్శకంగా వుండాలని, వారికి వెసులుబాటు కల్పించాలని, సాంస్కృతికపరంగా సున్నితంగా వ్యవహరించాలని మనం భాగస్వామ్య దేశాలను కోరుతుంటాం. వారిలో చాలామంది స్థానిక ఆచార వ్యవహారాలను నెమ్మదిగా, కాలక్రమేణా మాత్రమే నేర్చుకుంటూ వుంటారు.

ఇక్కడ బిజెపి కౌన్సిలర్ అవమానించిన కోచ్ ఆఫ్రికా దేశానికి చెందిన వ్యక్తి. ఒకవేళ మన భారతీయుల పట్ల కూడా అతడి దేశంలో ఇదే తీరున వ్యవహరిస్తే వారి పరిస్థితి ఏంటి? ఇక్కడ 'భారతీయులుగా వ్యవహరించడం లేదని' మనం విదేశీయులను విమర్శిస్తే, విదేశాల్లోని భారతీయుల పట్ల అక్కడి వారు సంయమనంతో వ్యవహరించాలని, బహుళపక్ష దృక్పథంతో వుండాలని మనం ఎలా ఆశించగలం? భారతదేశపు మృదువుగా వ్యవహరించే శక్తిని ఈ అసమానత తుడిచిపెడుతుంది. అలాగే చర్చల సమయంలో భారత్ విశ్వసనీయతను బలహీనపరుస్తుంది. ఇప్పటికే చర్చలు, సంప్రదింపులకు సంబంధించి శుష్కమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాం. ఉదాహరణకు, ఇటీవల కొత్తగా ప్రకటించిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి తీవ్రంగా విమర్శిస్తూ వలసలపై భారత్‌కు చాలా ఇచ్చేశామన్నారు.

పై సంఘటనలో ఆ మహిళా కౌన్సిలర్ తాను వ్యవహరించిన తీరుపై తానే ఆన్‌లైన్‌లో వీడియో పోస్టు చేశారు. తన రాజకీయ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్ళేందుకు ఆమె ఈ మొత్తం వ్యవహారాన్ని ఉపయోగించుకోవాలని చూస్తున్నారనే చర్చలకు దారితీసింది. ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో, మితవాద రాజకీయాలు నిజానికి సామాజిక మాధ్యమాల నుండే ఎగబాకుతాయి. జె.డి.వాన్స్ నిరంతరంగా ఆన్‌లైన్‌లో చేస్తున్న పోస్టులను పరిశీలిస్తే చిన్న చిన్న విషయాల్లో కూడా తనకు తాను దూరిపోతూ ట్రంప్ వారసుడిగా వుండేందుకు ఆయన చాలా జాగ్రత్తగా ఈ పంథాను అనుసరిస్తున్నారు. అమెరికా ఎల్లప్పుడూ 'క్రైస్తవ దేశం'గానే కొనసాగుతుందని ఆయన చెప్పుకుంటున్న మాదిరిగానే ఇదే తరహా తర్కంతో భాషాపరమైన, మతపరమైన దురభిమానం కూడా కొనసాగుతుంది. 'చెందివుండడం' అనే పదానికి నిర్వచనాన్ని సంకుచితపరచడం ద్వారా, వారు నిజానికి సామాజిక, ఆర్థిక విలువను సృష్టించే నైపుణ్యాలను, కార్మికులను, ఆలోచనలను, సత్సంకల్పాన్ని వెళ్ళగొట్టడానికి లేదా పారద్రోలడానికి ప్రయత్నిస్తున్నారు. విశ్వాసాన్ని అభద్రతగా వారు మార్చాలనుకుంటున్నారు. అటువంటి వారి విశ్వసనీయతా పరీక్షలను తోసిపుచ్చడమే సమాజ ఆరోగ్యానికి చాలా కీలకమైనది.

/ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సంపాదకీయం /

'నల్లి' కుట్టు

సెటైర్

ఇసాక...ఇజనూ!

"ఇసాఖపట్నం గానీ.. ఇంకా, ఏ పట్నం గానీ.. సివరాఖరికి.. ఏ బేరం లేని కళింగపట్నం గానీ.. ప్రెభుత్వాలకి పద్ధతిగా డెవలప్మెంట్ చేసే ఇజన్ లేదు"

దసుమంతు నాయుడు ఏజెన్సీ నుంచి విశాఖపట్నం వచ్చాడు గానీ, పట్నం చూసిన తర్వాత ప్రశాంతంగా లేదు. పరదేశి నాయుడు ఆయన్ని ఖుషీ చేయడానికి కారుని బీచ్ రోడ్డుకి తిప్పించాడు. అందమైన రంగుల రోడ్డు... చల్లటి గాలి.. నడమంత్రపు కొబ్బరి చెట్లు.. విగ్రహాలు.. కచ్చితంగా నాయుడికి నచ్చుతాయి అనుకున్నాడు పరదేశి.

"ఈ ఇగ్రహాలూ.. బొమ్మలూ.. దిమ్మలేట్రా?..పీకి పారేసి, బిజినెస్సు బిల్డింగులు కట్టేయాలి గానీ.. సెప్పానా!..ప్రెభుత్వాలకి సరైన ఇజన్ లేదు.. కొబ్రి సెట్లు.. ఓకే.. బతకలేని దగ్గిర బతికించీసీనారు.. మరి, ఆటి మద్దిలోనైనా.. మన రోడ్ల పక్క దాబాల్లాగా.. పాకలు కట్టించీసి.. మన పాత్రుడు గారు సెప్పినట్టు.. సీసాల మోత మోగించెయ్యాలి గదా!?"

"మనలాగే, పాత్రుడు బాబు కూడా, ఏజెన్సీ లీడరు గదా! ..అన్నాడు గానీ, ఆయన మాట ఎవరింటారు? సెప్పిందేదో, గోవా మసాజ్ లాగా మంచి మాట సెప్పాడు.. ఎవుల సెవులకు ఎక్కుద్ది!? పైన ఉన్నోళ్లు ..పదీ..ఇరవై అంతస్తుల ఓనర్ల లాడ్జిల ఫ్రెండ్సు మరి!"

"అన్నా! రామక్రిష్ణ బీచీ..వొయిజాగు ఫేమసు.. దిగుదమా!!"

"అదిరా సంగతి.. రాముడు.. కిష్టుడు.. బీచి గాబట్టి.. ఇక్కడ మందు ఎలొవు లేదు.."

కారు జోరుగా కైలాసగిరి మలుపు తిరిగింది. తెన్నేటి పార్క్ ఎదురుగా పార్కింగ్ లోకి తిప్పించాడు పరదేశి.

"అన్న! తెన్నేటి పార్కు బాగుంటాది.. ఎల్లి ఒకసారి సూద్దుమా! కిందికి దిగితే చానా బాగుంటదట!"

"తెన్నేటి అంటే.. తేని పోస్తారా.. ఇక్కడ కూడా, మందూ, మాంసం లేదయతే.. అంతేనా!" - విసుక్కున్నాడు నాయుడు. ఎదురుగా, అరుకు కాఫీ షాపు బోర్డు కనిపించింది. సంతోష పడ్డాడు.

"సూద్రా! మన గింజల పొడి ఇక్కడా అమ్ముకుంటున్నారు... మనకీ పర్మిషన్ ఇస్తే, ఇప్ప సారా, గంజాయి కుప్పలు, కుప్పలు.. తెచ్చి పడీద్దుము గదా!"

"అలాంటివి ప్రెభుత్వం ఒప్పుకోదన్నా.. మన ఏరియాలో అయితే, మనమే ప్రెభువులం"

"మరి, ఆ తేనేట్రా! "

"తెన్నేటి అంటే తేనె గట్రా కాదన్నా.. ఆయన గొప్ప నాయకుడు.. స్టీల్ ప్లాంట్.. ఇలాంటివి సాధించాడట! మన అరుకు ఏజెన్సీలో కాఫీ విత్తనాలు కూడా ఆయనే మొట్టమొదటి జల్లించినాడట!"

"అయితే, ఆయన జల్లించిన కాఫీ పొడి ఇక్కడ అమ్ముకుంతన్నారు.. ఆయన తెచ్చిన స్టీల్ ప్లాంట్ ఎందుకు మరొకరికి అమ్ముకుంతన్నారు!?"

"అన్నా! ఇంకా నీకు అర్థం కాలేదా? మరి నీ ఇజను ఏటయింది? బడ్డీ కొట్టోల్లు, సంతల సామాన్లు అమ్ముకున్నోళ్ళు..ఓట్లు వేస్తారు గానీ, రాజకీయ పార్టీ వోళ్ళకి డబ్బులిత్తారేటీ!!"

పరదేశి ప్రవచనం..దసుమంతు నాయుడుకి పరమ నిజమనిపించింది. పార్క్ చూసే ఇంట్రెస్ట్ నాయుడుకి లేదని పరదేశి గ్రహించి, కారుని భీమిలి రోడ్డు వైపు పొమ్మని డ్రైవర్‌కి చెప్పాడు.

జోడు గుళ్లపాలెం దాటిన నుంచి అటు, ఇటూ.. రిసార్టులు..కాస్ట్‌లీ హోటళ్లు.. అక్కడ దక్కడా. సరుగుడు తోటలు..పెద్ద పెద్ద స్వాముల ఆశ్రమాలు..గుడులూ..గెస్ట్ హౌసులూ..

"అన్నా! రామానాయుడు స్టూడియో కొండ సూద్దుమా!"-నాయుడుని హుషారు చేయడానికి పరదేశి ప్రయత్నించాడు.

"ఏటి! రామానాయుడు స్టూడియో కొండా!? ఇక్కడొక ప్రేమనగర్ కట్టేసినాడేటీ!?"

"ఏదో పేరుతో మదుపెట్టాలే గానీ.. కొనడానికి కొండలేటి తక్కువన్నా!!"

ఈలోగా.. ఒక పెద్ద కాలేజి వచ్చేసింది.

"అన్నా! ఈడూ ఆక్రమించేసినాడు...ఈ గోడ గవర్నమెంటుదే!"

"ఏట్రా! వొయిజాగు ఇంత సవకయి పోయింది!?"

"డిపార్ట్మెంటోళ్లని.. మేనేజు చేసుకుంటే చాలు.. సముద్రం ఒడ్డంతా నొల్లేయొచ్చు.. షాపులోలు తప్ప.. సేపలోల్లు ఖాళీ గదా!"

"అవునా!"-ఆశ్చర్యం నుంచి తేరుకునే లోగా.. ఎర్ర మట్టి దిబ్బలొచ్చేశాయి. జీడి తోట చూడగానే, నాయుడికి ప్రాణం వచ్చినట్టయింది.



> "తెన్నేటి అంటే తేనె గట్రా కాదన్నా.. ఆయన గొప్ప నాయకుడు.. స్టీల్ ప్లాంట్.. ఇలాంటివి సాధించాడట! మన అరుకు ఏజెన్సీలో కాఫీ విత్తనాలు కూడా ఆయనే మొట్టమొదటి జల్లించినాడట!"
> "అయితే, ఆయన జల్లించిన కాఫీ పొడి ఇక్కడ అమ్ముకుంతన్నారు.. ఆయన తెచ్చిన స్టీల్ ప్లాంట్ ఎందుకు మరొకరికి అమ్ముకుంతన్నారు!?"
> "అన్నా! ఇంకా నీకు అర్థం కాలేదా? మరి నీ ఇజను ఏటయింది? బడ్డీ కొట్టోల్లు, సంతల సామాన్లు అమ్ముకున్నోళ్ళు..ఓట్లు వేస్తారు గానీ, రాజకీయ పార్టీ వోళ్ళకి డబ్బులిత్తారేటీ!!"

ఏజెన్సీలో అతని పేకాట పాకలూ, నాటు సారా వంటశాలు, గంజాయి పంట భూమి.. జీడి, మామిడి తోటలు.. గుర్తుకొచ్చాయి.

"ఆపురా! ఆపురా! తోట..ఎర్ర మన్ను దిబ్బలు బాగున్నాయి.."

కారు ఆగింది. ముగ్గురూ దిగారు. ఎర్ర దిబ్బలన్ని తవ్వేసి, మట్టి మోసుకుపోతున్న ట్రాక్టర్లు కనిపించాయి. పచ్చ జీడి చెట్లు.. కూలిపోవడం కనిపించాయి.

"ఏట్రా! తోటల్ని నాశనం సేసీయడమేటి!?" అన్నాడు నాయుడు.

"ఇషిత్రం ఏటుందన్నా!? అటు నుంచి మనం అడువులు.. ఇటు నుంచి ఈళ్లు తోటలు.. జెండా ట్రాక్టర్లనీ.. లారీలనీ ఎవడు అడ్డీగలడు!?" ★

మారణాయుధాలతో పుట్టిన రోజు వేడుకలా?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైసిపి శ్రేణులు వేట కొడవళ్లు వంటి మారణాయుధాలతో ప్రదర్శనలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం శోచనీయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మారణాయుధాలు పట్టుకుని బహిరంగంగా ప్రదర్శనలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదమని, జరుగుతున్న చర్యలపై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, విజన్‌తో రాష్ట్రానికి పెట్టుబడిదారులు, ప్రముఖ కంపెనీలు ఆకర్షితువుతున్నారని తెలిపారు. శాంతి, భద్రత, స్థిరమైన పాలన ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని చెప్పారు. పెట్టుబడిదారులను భయపెట్టే కుట్రలో భాగంగా వైసిపి, జగన్ అనుయాయులు రాష్ట్రాన్ని అశాంతివైపు నెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ హింసాత్మక రాజకీయ సంస్కృతిని తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని చెప్పారు. వేట కత్తులతో జగన్ పుట్టిన రోజు వేడుకలు చేస్తూ వైసిపి నేతలు రెచ్చిపోతున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్సీ పి అశోక్ బాబు మరో సమావేశంలో అన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.



గడ్డం సందీప్ , ఇయ్యాల విద్యాసాగర్

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన బైక్


- ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు మృత్యువాత

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా రంపచోడవరం సమీపంలో ఐ పోలవరం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... పి.గన్నవరం మండలం కాత్రేనికోనకు చెందిన గడ్డం సందీప్ (30), కాత్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన ఇయ్యాల విద్యాసాగర్ (38) చింతూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ సెలవు కావడంతో తమ స్వగ్రామాలకు బైక్‌పై వెళ్తుండగా పాలకాలువ దాటిన తర్వాత ఐ.పోలవరం వద్ద ఆగి ఉన్న కారును వీరి బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యారు. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, గడ్డం సందీప్ అక్కడ మృత్యువాత పడ్డారు. ఆరోగ్యం విషమంగా ఉన్న విద్యాసాగర్‌ను రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మూడు నెలల క్రితమే వీరిద్దరూ ప్రమోషన్‌పై చింతూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లో చేరారు. గడ్డం సందీప్ ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తుండగా, విద్యాసాగర్ శీతనపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. విధుల్లో చేరిన మూడు నెలల్లోనే స్థానిక ప్రజలతో మమేకమై సేవలు అందిస్తున్నారు. వీరిద్దరి మరణంతో వారి స్వగ్రామాల్లోనూ, పనిచేస్తున్న పంచాయతీల్లో విషాదఛాయలు అలుముకున్నారు.

అమరావతిలో 49 ఎకరాల కేటాయింపు

- 42.30 ఎకరాల్లో స్వల్ప మార్పులు
- ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్లస్థలాలకు 12 ఎకరాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో వేర్వేరు సంస్థలకు కొత్తగా 49.50 ఎకరాలు కేటాయించారు. దీనికి సంబంధించి పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. బాసిల్ ఉడ్ స్కూలుకు నాలుగు ఎకరాలు, శాంతామారియా (సెయింట్ మేరీస్)కు 7.97 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయించారు. సివిల్ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌కు 15 ఎకరాలు, కాగ్‌కు 5 ఎకరాలు, ఎన్‌టిపిసికి 1.50 ఎకరాలు, జ్యుడీషియల్ అకాడమీకి 4.83 ఎకరాలు, కాన్సోస్‌కు 5 ఎకరాలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, పిఎన్‌బి, బిఓబి లకు 40 సెంట్లు చొప్పున భూమి కేటాయించారు. ఎన్‌సికె 5 ఎకరాలు 60 ఏళ్ల లీజుకు ఎకరం 4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించారు. గతంలో వేర్వేరు సంస్థలకు కేటాయించిన 42.30 ఎకరాలకు సంబంధించి 16 సెంట్లలో స్వల్ప మార్పులు చేశారు. బ్యాంకులు, వేర్వేరు ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు 12.66 ఎకరాలు ఎకరం రూ.4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించి ఇచ్చారు. 2014-19 మధ్యలో భూములు కేటాయించిన సంస్థలకు సంబంధించి 16.19 ఎకరాల్లో స్వల్పమార్పులు చేశారు. ఇందులో డివిఐ స్కూలుకు ఎకరం రూ.50 లక్షల చొప్పున ఇచ్చారు. ఎన్ఐబిఎకి ఎకరం రూ.4 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయించారు. శాంభరి హోటల్స్‌కు ఎకరం రూ.1.50 కోట్లు, కినారా గ్రూపుకు ఎకరం రూ.1.50 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో ఇచ్చారు.

హైకోర్టు ర్యాఫ్ట్ పనులు ప్రారంభం

రాజధాని పరిధిలో నిర్మిస్తున్న హైకోర్టు ర్యాఫ్ట్ పనులను గురువారం రాత్రి మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 52 కోర్టు హాళ్లు ఉండేలా దీన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎనిమిది అంతస్తుల్లో ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఉంటుందని వివరించారు. దీనికోసం 45 వేల టన్నుల స్టీలు ఉపయోగిస్తున్నామని చెప్పారు. 2027 చివరినాటికి హైకోర్టు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.



కనకమేడల రవీంద్రకుమార్‌కు ఎపి ఎన్‌జిజిఒ అభినందనలు

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

నాలుగు దశాబ్దాల పాటు న్యాయవాద వృత్తిలో అంకితభావంతో సేవలందించిన రాజ్యసభ మాజీ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్‌ను భారతదేశ న్యాయవ్యవస్థలో అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమించడం అభినందనీయమని, ఆయనకు పదవి లభించడం దక్షిణ భారతదేశానికే వన్నె తెచ్చిందని ఎపి ఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఇటీవల అదనపు సొలిసిటర్ జనరల్ పదవికి ఎంపికైన రవీంద్ర కుమార్‌ను గురువారం విజయవాడ ఎపి ఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశం నుంచి, అందునా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆ పదవిని అలరించిన అతి కొద్దిమందిలో రవీంద్రకుమార్ ఒకరని తెలిపారు. లెజిస్లేటివ్, జ్యుడీషియల్‌లో ఉన్న అనుభవం ఆ పదవిని నిర్వహించడంలో మరింత వన్నె తెస్తుందన్నారు. రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలిపిన వారిలో రాష్ట్ర కోశాధికారి భారతీ ప్రసాద్, మాజీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడు, పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సత్యనారాయణ రెడ్డి, రమేష్, అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర రెడ్డి, చంద్రమోహన్, కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు బి.వెంకటేష్ బాబు, జిల్లా ఎన్జీవో నాయకులు ఎం.రాజబాబు, బి.సతీష్, డి విశ్వనాథ్, విజయవాడ నగర శాఖ నాయకులు సివిఆర్ ప్రసాద్, మధుసూదన్, సురేఖ తదితరులు ఉన్నారు.

163 శాతానికి చేరిన లోటు

- కేంద్రం నుంచి వచ్చింది 23 శాతమే
- నవంబర్ వరకు తేలిన ఆర్థిక లెక్కలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎనిమిదో నెల వచ్చినప్పటికీ ఆర్థిక పరిస్థితి మాత్రం కుదుటపడడం లేదు. లోటు మాత్రం భారీగా పెరిగిపోతోంది. కేంద్రం నుంచి నిధులు రాకపోవడం, స్థానిక పన్నుల్లో తగ్గుదల వంటివి ఆందోళనకరంగానే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా కాగ్ నివేదిక ఆందోళనే కలిగిస్తోంది. నవంబ ర్ వరకు కాగ్ విడుదల చేసిన తాజా గణాంకాల మేరకు ఏకంగా 163 శాతం ఆదాయ లోటు ఉన్నట్లు తేలింది. ఏడాది మొత్తానికి 33,186 కోట్ల వరకు ఆదాయ లోటు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, నవంబర్ నాటికే 54 వేల కోట్లు దాటిపోవడం విశేషం. ఇక ద్రవ్య లోటు కూడా వార్షిక అంచనాలకు అతి దగ్గరగా రావడంతో మార్చి నాటికి భారీగా లోటు పెరిగిపోవడం ఖాయమని అధికారులు అంటున్నారు. బడ్జెట్‌లో 79,927 కోట్లకు ద్రవ్య లోటు ఉంటుందని అంచనా వేయగా నవంబర్ నాటికే 96 శాతంతో 76 వేల కోట్లు దాటిపోయింది. ఇక మొత్తం ఆదాయాన్ని పరిశీలిస్తే పన్నులు, కేంద్రం నుంచి రావాల్సిన ఆదాయం 2,17 లక్షల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పటి వరకు 1.05 లక్షల కోట్లు మాత్రమే రావడం గమనార్హం.

కేంద్రం నుంచి 23 శాతమే

కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని అంచనా వేసినప్పటికీ కేవలం 23 శాతం మాత్రమే రావడం ఆందోళనకరంగానే కనిపిస్తోంది. ఏడాది మొత్తానికి గ్రాంట్లు రూపంలో 32,284 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఎనిమిది నెలల్లో కేవలం 7,693 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి వచ్చాయి. గతేడాది 32 శాతం నిధులు రాగా, ఈసారి దాదాపు ఎనిమిది శాతం తక్కువగా రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

రుణాలూ టాప్‌లోనే

ప్రతి నెలా తీసుకోవాల్సిన రుణాలు కూడా అంచనాలకు మించిపోయే కనిపిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 79,052 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించుకోగా, కేవలం ఎనిమిది నెలల్లోనే 77,080 కోట్లు రుణాన్ని తీసేసుకున్నారు. ఇది మొత్తం అంచనాలో 96 శాతం కన్నా ఎక్కువ కావడం గమనార్హం. అంటే మిగిలిన నాలుగు నెలలకు కేవలం రెండు వేల కోట్లు మాత్రమే తీసుకునేందుకు ఆస్కారం ఉందని అధికారులు అంటున్నారు.

త్రీమెన్ కమిటీ నిర్ణయాలు తెలియడం లేదు

- రాజధాని రైతు జెఎసిలో చర్చ
- రైతు ప్రతినిధులను తీసుకోవాలని సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీలో సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం లేదని, చర్చల అంశాలు కూడా తెలియడం లేదని రైతు జెఎసి ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గురువారం జరిగిన జెఎసి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీలో చర్చించే అంశాలు, వేటిని పరిష్కరించారు అనే విషయాలపై రైతులకు ఎటువంటి సమాచారమూ ఉండటం లేదని, సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కారం కావడం లేదని అభిప్రాయపడినట్లు తెలిసింది. ఇప్పటికే అనేక సమస్యలు విన్నవించామని, ఒక్కటీ పరిష్కారం అవలేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రైతు జెఎసి నుండి కనీసం ముగ్గురు లేదా ఐదుగురిని సభ్యులుగా తీసుకోవాలని, లేదా సమావేశాలకు ఆహ్వానించేలా ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో అభివృద్ధి పనులు వేగమందుకున్నాయని, ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, రైతుల సమస్యలు పరిష్కారంలో ఆలస్యం అవుతోందని, వాస్తవంగా అమరావతి రాజధాని భాగస్వామ్య అభివృద్ధి అనే విషయంపై సమావేశంలో కొంత చర్చ జరిగినట్లు తెలిసింది. ముఖ్యంగా రాజధానిలో కొంతమంది రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చే సమయంలో పూలింగుకు ఇవ్వని భూముల్లో ప్లాట్లు ఇచ్చారని, వాటిని రద్దు చేసి అదే గ్రామపరిధిలో ప్లాట్లు ఇచ్చేలా చూడాలని సిఆర్‌డిఏ కమిషనర్‌ను, త్రిమెన్ కమిటీని కోరాలని నిర్ణయించారు. సాధ్యంకాని పరిస్థితుల్లో దగ్గర్లో ఇవ్వాలని కోరనున్నారు. గ్రామాల్లో శ్మశానాలకు సంబంధించి ఏ గ్రామంలో ఆ గ్రామంలోనే ఇవ్వాలని దానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యేను కోరాలని నిర్ణయించారు. మరీ ముఖ్యంగా ఆర్5 జోన్‌కు సంబంధించి సుప్రీం కోర్టులో ఉన్న కేసును వచ్చే ఏడాది మార్చిలోపు పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరనున్నారు. అమరావతి గెజిట్‌కు సంబంధించి వచ్చే పార్లమెంటు సమావేశాల్లో అన్నా బిల్లు పెట్టేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని చర్చించారు. గ్రామాల్లో పనులు జరుగుతున్న సమయంలో మంచినీటి పైపులైన్లు, రోడ్లు దెబ్బతింటున్నాయని, దీనివల్ల నీటి సమస్య వస్తోందని, వచ్చే వేసవి నేపథ్యంలో అటువంటి ఇబ్బందులు లేకుండా సిఆర్‌డిఏ త్వరితగతిన పరిష్కరించాలని జెఎసి తరుపున కోరాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై కమిషనర్ నేరుగా జోక్యం చేసుకోవాలని ప్రతిపాదించారు.

వాజ్‌పేయికి గవర్నర్ నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని వాజ్‌పేయికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఘనంగా నివాళులర్పించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి గవర్నర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయి గొప్ప వక్త, కవి, పరిపాలనా దక్షుడని పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారుల అనుసంధానికి పిఎంజిఎస్‌వై, నాలుగు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలను అనుసంధానించే స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్ట్ వంటివి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జాయింట్ సెక్రెటరీ పిఎస్ సూర్యప్రకాష్, లోక్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రా ట్యాక్సీ యాప్ ఆవిష్కరణ

అందుబాటులో విహార యాత్ర సేవలు : ఎన్‌టిఆర్ కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

పర్యాటకంలో ఎన్‌టిఆర్ జిల్లాను నంబర్ వన్‌గా నిలిపేందుకు ఆంధ్రా ట్యాక్సీ పేరుతో యాప్‌ను ఆవిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన యాప్‌ను గురువారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటకులకు అందుబాటు ధరల్లో సురక్షితమైన, సంతోషకరమైన విహారయాత్ర సేవలను ఈ ప్రత్యేక యాప్ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సౌకర్యవంతమైన ప్రయాణానికి సరైన ఎంపిక ఆంధ్రా ట్యాక్సీ అని.. ఇందులో ఎన్‌టిఆర్ జిల్లా టూరిజం వివరాలు, వ్యవసాయ డ్రోన్, రవాణా సేవలు, సమీప పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమైన ఎస్ఒఎస్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. మొబైల్ యాప్‌తో పాటు క్యూఆర్ కోడ్, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా కూడా ఆటో, ట్యాక్సీ తదితర సేవలను బుకింగ్ చేసుకునే వీలుందన్నారు. జిల్లాకు సంబంధించి ఒకటి, రెండు, మూడు, నాలుగు రోజుల పర్యాటక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. యాప్ ఆవిష్కరణ అనంతరం మొబైల్ యాప్ ద్వారా ట్యాక్సీ, ఆటో రైడ్‌లను బుక్ చేసుకొని బెంజ్ సర్కిల్ వరకు కలెక్టర్ ప్రయాణించారు. యాప్ ద్వారా అందుతున్న సేవలను



ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఇన్‌ఛార్జ్ ఆర్‌టిఒ కె.వెంకటేశ్వరరావు, విజయవాడ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సాయిప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు వి.బాబూరావు, రాష్ట్ర ఆటో ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఆదిబాబు పాల్గొన్నారు.



సిద్ధమవుతున్న పందెం కోళ్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్రాంతిని పురస్కరించుకుని పండుగ మూడు రోజులు పందేలు జోరుగా నిర్వహించేందుకు ముదినేపల్లి మండలంలోని పందేల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అడపాదడపా ముసుగు కోడి పందేలు మొదలయ్యాయి. ముదినేపల్లి మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బరిలో దింపేందుకు కోడి పుంజులను భారీగా పెంచుతున్నారు. కోడి పందేల రాయుళ్లు నాలుగు నెలలుగా పుంజులను పెంచే పనిలో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం సంక్రాంతి సంబరాలకు అనుమతి ఇస్తుండటం, సంబరాల పేరుతో విచ్చలవిడిగా కోడి పందేలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పోలీసుల భయం లేకుండా సంక్రాంతి సంబరాల్లో పందేలు వేసే అవకాశం ఉండటంతో గ్రామగ్రామాన పందెం పుంజులను భారీగా పెంచుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కోడిపందేల బరులు సిద్ధం చేసే పనుల్లో పందెంరాయుళ్లు నిమగ్నమయ్యారు. మండలంలో గురజ, పెదపాలపర్రు, పెయ్యేరులోని వైఎస్ఆర్ కాలనీ, వాడవల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసి కోడి పుంజులను పెంచుతున్నారు. ఒక్కో వ్యక్తి 20 నుంచి 50 పుంజులను ప్రత్యేక షెడ్డుల్లో ఉంచి పర్యవేక్షిస్తున్నాడు. ఇలా మండలంలో సుమారు 300 పుంజులు తయారవుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పుంజు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడిపుంజుల అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పుంజు సామర్థ్యాన్ని బట్టి రూ.ఐదు వేల నుంచి రూ.25 వేలకు పైగా ధర పలుకుతోంది. కోడిపందేలు, జూదం సాగనివ్వబోమని ఓ వైపు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ పందేల పండుగ నిర్వహించేందుకు పందెంరాయుళ్లు ఇప్పటికే సమాయాత్తమవుతున్నారు.

పదేళ్లనుంచి పందెం కోళ్ల పెంపకం

గత పదేళ్ల నుంచి పందెం కోళ్ల పెంపకం చేస్తున్నా. నాలుగు నెలలు క్రితం మొవ్వ ఫణింద్రతో కలిసి మూడు ప్రాంతాల్లో కోళ్ల పెంపకం చేస్తున్నాం. కాకి, డేగ, నెమలి, తేతువా, పింగళి వివిధ రకాల పందెం పుంజులను కొనుగోలు చేసి రెండున్నర, మూడున్నర కేజీల బరువు ఉండేలా పుంజులను సిద్ధం చేస్తాం. పుంజు సామర్థ్యాన్ని బట్టి రూ.15 వేల నుంచి రూ.25 వేలుకు పైగా ధర పలుకుతోంది. ఫామ్ దగ్గరే విక్రయిస్తాం.

అరుగుల మహేష్, ముదినేపల్లి

గంజాయి ముఠా అరెస్టు

- పది కిలోల గంజాయి స్వాధీనం : సిఐ

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట రూరల్ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయించే ఏడుగురు యువకులను కొత్త బోయినపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సిఐ ప్రసాద్‌బాబు గురువారం వివరాలు వెల్లడించారు. బీహార్ యువకులు ఇతర రాష్ట్రాల నుండి పెద్ద మొత్తంలో గంజాయిని తీసుకు వచ్చి తిరుపతి జిల్లా వనమాలపేటలో డాబా నడుపుతూ గంజాయి విక్రయం చేసేవారని తెలిపారు. రాజంపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి పది కిలోల గంజాయి, ఆరు సెల్ ఫోన్లు, రూ.మూడువేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇజ్రాయిల్ చర్య చట్టవిరుద్ధం

- సెటిల్మెంట్ల విస్తరణపై మండిపడిన యూరోపియన్ దేశాలు, కెనడా

వెస్ట్‌బ్యాంక్ : ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ సెటిల్మెంట్లను విస్తరించేందుకు ఇజ్రాయిల్ పన్నుతున్న ఎత్తుగడలను 14 దేశాలు తీవ్రంగా ఖండించాయి. పాలస్తీనియన్లకు మద్దతును పునరుద్ఘాటించాయి. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో కొత్తగా 19 సెటిల్మెంట్లను చేర్చేందుకు ఇజ్రాయిల్ ఆమోదం తెలిపింది. ఈ చర్యను బ్రిటన్, కెనడా, డెన్మార్క్ సహా పలు దేశాలు తప్పుపట్టాయి. ఇజ్రాయిల్ చర్య చట్టవిరుద్ధమని, గాజా కాల్పుల విరమణకు, ఆ ప్రాంతంలో దీర్ఘకాలిక శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని మండిపడ్డాయి. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, గాజా ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఇజ్రాయిల్ భద్రతా క్యాబినెట్ నిర్ణయాన్ని బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఐస్‌లాండ్, ఐర్లాండ్, జపాన్, మాల్టా, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, బ్రిటన్ దేశాలు ఖండిస్తున్నాయి' అని ఆయా దేశాలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సెటిల్మెంట్ విధానాల విస్తరణ కోసం అవలంబించే ఏ ప్రణాళికనైనా తాము వ్యతిరేకిస్తామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సెటిల్మెంట్ల విస్తరణకు పాల్పడవద్దని ఇజ్రాయిల్‌ను కోరారు. పాలస్తీనియన్ల స్వీయ నిర్ణయాధికార హక్కుకు మద్దతు ఇస్తామని అంటూ రెండు దేశాల పరిష్కారం ఆధారంగా సమగ్రమైన, న్యాయసమ్మతమైన, దీర్ఘకాలిక శాంతి స్థాపనకు కట్టుబడి ఉంటామని తెలిపారు. కాగా 14 దేశాల సంయుక్త ప్రకటనపై ఇజ్రాయిల్ విమర్శలు కురిపించింది. ఇజ్రాయిల్‌లో నివసించేందుకు యూదులకు ఉన్న హక్కును విదేశాలు నియంత్రించలేవని తెలిపింది.

పురుగుల అన్నం.. నీళ్ల చారు..!

- హాస్టల్ సిబ్బంది తీరును నిరసిస్తూ గిరిజన విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-కదిరి టౌన్

పురుగుల అన్నం.. నాసిరకం కాయగూరలతో చేసిన చారు తినలేక గిరిజన విద్యార్థులు హాస్టల్‌లో ఖాళీ ప్లేట్లు ముందు పెట్టుకుని నిరసన తెలిపారు. కదిరి పట్టణం అనంతపురం రోడ్డు డిగ్రీ కళాశాల వెనుక ఉన్న గిరిజన వసతి గృహంలో కొద్ది రోజుల నుంచి అన్నంలో తెల్ల పురుగులు, లక్క పురుగులు వస్తున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కుళ్లిపోయిన కూరగాయలతో చారు, పురుగుల అన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

మద్యం-పొగాకుతో భారీ ముప్పు

- వాటితోనే 62 శాతం నోటి కేన్సర్ కేసులు
- యువతలో పెరుగుతున్న ప్రమాదం : అధ్యయనం

న్యూఢిల్లీ : భారత్‌లో నోటి క్యాన్సర్ కేసుల్లో సుమారు 62 శాతం మద్యపానం (ఆల్కహాల్), పొగాకు (గుట్కా, ఖైనీ, పాన్ వంటి పొగాకు పదార్థాలు) వినియోగం వల్లనే జరుగుతున్నాయని ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనాన్ని మహారాష్ట్రలోని సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ, హోమీ భాభా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధక బృందం నిర్వహించింది. ఈ అధ్యయన ఫలితాలను బీఎంజే గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి.

మద్యం తక్కువ మోతాదైనా ప్రమాదమే

ఈ పరిశోధన ప్రకారం.. రోజుకు రెండు గ్రాముల కంటే తక్కువ మోతాదులో బీరు తీసుకున్నా కూడా బక్కల్ మ్యూకోసా క్యాన్సర్ (బిఎంసి) ముప్పు పెరుగుతుంది. రోజుకు తొమ్మిది గ్రాముల మద్యం (సుమారు ఒక స్టాండర్డ్ డ్రింగ్‌కు సమానం) సేవిస్తే నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం సుమారు 50 శాతం వరకు పెరుగుతుంది. దేశవ్యాప్తంగా నోటి క్యాన్సర్ కేసుల్లో 62 శాతం వరకు మద్యపానానికి పొగాకు తోడవటం వల్లనే జరుగుతున్నది.



రాష్ట్రాలవారీగా ప్రభావం

దేశవ్యాప్తంగా బక్కల్ మ్యూకోసా క్యాన్సర్ కేసుల్లో 11.5 శాతం మద్యానికి సంబంధించినవిగా గుర్తించబడ్డాయి. అంటే పది కేసుల్లో ఒకటికి పైగా ఇవే అన్నమాట. అయితే మేఘాలయ, అసోం, మధ్యప్రదేశ్, వంటి రాష్ట్రాలో ఇది 14 శాతం వరకు ఉండటం గమనార్హం. ఇక మద్యం వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రంగా అరుణాచల్‌ప్రదేశ్ (26 శాతం) నిలవగా.. గుజరాత్ (4 శాతం)లో మద్యం వినియోగం చాలా తక్కువగా ఉన్నది.

భారత్‌లో నోటి క్యాన్సర్ పరిస్థితి

2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల కొత్త నోటి క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. భారత్‌లో ఇది రెండో అత్యంత సాధారణ క్యాన్సర్. ప్రతి ఏడాది సుమారు 1,43,759 కేసులు, 79,979 మరణాలు నమోదవుతున్నాయి. భారత్‌లో నోటి క్యాన్సర్ ప్రధాన రూపం బీఎంసీ. ఇక్కడ దీని మనుగడ రేటు తక్కువగానే ఉన్నప్పటికీ.. ఐదేళ్ల నికర మనుగడ రేటు 43 శాతంగా ఉన్నది.

యువతలోనూ పెరుగుతున్న ప్రమాదం

ఈ పరిశోధనలో పాల్గొన్నవారు ఎక్కువ మంది 35-54 ఏండ్ల వయసువారే. అయితే నోటి క్యాన్సర్ కేసుల్లో దాదాపు 46 శాతం మంది 25-45 ఏండ్ల వయసున్న యువత ఉండడం ఆందోళన కలిగించే అంశంగా పరిశోధకులు పేర్కొన్నారు. మద్యం సేవించనివారితో పోలిస్తే.. మద్యం సేవించేవారిలో నోటి క్యాన్సర్ ప్రమాదం 68 శాతం ఎక్కువగా ఉన్నది. అంతర్జాతీయ బ్రాండ్ల మద్యం తీసుకునేవారిలో ఇది 72 శాతం, స్థానికంగా తయారయ్యే మద్యం సేవించేవారిలో 87 శాతం వరకు ప్రమాదం పెరుగుతుందని అధ్యయనం హెచ్చరించింది. తాజా అధ్యయనం మద్యం, పొగాకు వల్ల కలిగే అనర్థాలను నొక్కి చెప్తున్నదని వైద్య నిపుణులు చెప్తున్నారు. కాబట్టి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా దేశ యువత వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదనీ, లేకపోతే క్యాన్సర్ బారిన పడే ప్రమాదముంటుందని హెచ్చరిస్తున్నారు. మద్యం తక్కువ మోతాదు అయినా నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందనీ, దానికి పొగాకు కూడా తోడైతే బీఎంసీ కేసులు తీవ్రమవుతాయన్న విషయాన్ని వైద్య నిపుణులు హైలెట్ చేస్తున్నారు. కాబట్టి ఈ విషయంలో నివారణ ఒక్కటే ఉత్తమమైన మార్గమని అంటున్నారు.



సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు

- కానీ.. షరతులు వర్తిస్తాయి

న్యూఢిల్లీ : మన సైనికులు సోషల్ మీడియాను వినియోగించడంపై ఇప్పటి వరకూ కఠిన వైఖరి అవలంబిస్తూ వచ్చిన భారత రక్షణశాఖ.. తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించింది. జవాన్లు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, ఇందుకు కొన్ని షరతులు కూడా విధించింది. ఈ విషయాన్ని వివిధ ఆంగ్ల మీడియాలు తమ కథనాల్లో వెల్లడించాయి. తాజా సవరణలకు సంబంధించి అన్ని సైనిక యూనిట్లకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ మార్గదర్శకాలు పంపించినట్టు ఈ కథనాలు పేర్కొన్నాయి. ఈ మార్గదర్శకాల్లో కేవలం సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించాలని స్పష్టంగా పేర్కొన్నారు. పోస్టులు చేయడం, కామెంట్లు పెట్టడం, షేరింగ్, మెసేజ్‌లకు రియాక్ట్ అవడం వంటివి చేయకుండా కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అంటే.. సైనికులు కేవలం ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించొచ్చు కానీ.. అందులో ప్రతిస్పందించేందుకు అనుమతి ఉండదన్నమాట. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియాలో కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

అలాగే, తమ ఖాతాలో తప్పుదోవ పట్టించే పోస్టులు, నకిలీ సమాచారం ఉన్నట్టయితే వాటిని తక్షణమే సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వీపీఎన్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వెబ్ ప్రాక్సీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించొద్దని సైనికులను మరోసారి హెచ్చరించారు. డిజిటల్ అవగాహన, దేశ భద్రత మధ్య సైనికులు సమతూకంగా ఉండాలని ఈ మార్గదర్శకాలతో గుర్తుచేశారు. అలాగే, వీటిని వినియోగించడంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంటామన్నారు. హనీట్రాప్, డబ్బు ఆశ జూపి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడం వంటి ఘటనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై ఆర్మీ కఠిన నిబంధనలు అవలంబిస్తోంది. 2020లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సహా 89 మొబైల్ యాప్‌లపై సైన్యం నిషేధం విధించింది. కానీ, ఆ తర్వాత ఇందులో కొన్ని సడలింపులు తీసుకొచ్చింది. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, లింక్డ్ ఇన్, టెలిగ్రామ్, వాట్సప్ వంటి వాటిని పాక్షికంగా వినియోగించేందుకు అనుమతినిచ్చింది.

హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలి

- ఉన్నావ్ అత్యాచారం కేసుపై సుప్రీంకోర్టులో పిటిషన్
- ఢిల్లీ పోలీసుల తీరుపై రాహుల్ విమర్శలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నావ్ అత్యాచారం కేసులో బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంలో గురువారం పిటిషన్ దాఖలైంది. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పకర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కుల్దీప్ సింగ్ సెంగర్ జీవితాంతం జైలులోనే ఉండాలని ట్రయల్ కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు ఈ ఉత్వర్వులు జారీ చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. సెంగార్‌కు తీవ్రమైన నేర చరిత్ర ఉందని, అత్యాచారం వంటి దారుణమైన నేరాల్లో ఆయన ప్రమేయం స్పష్టంగా ఉందన్నారు. ఆయనకి శిక్షను నిలిపివేయడంలో హైకోర్టు చట్టంలోనూ, వాస్తవాల్లోనూ తీవ్రమైన తప్పు చేసిందని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఇచ్చిన భౌతిక సాక్ష్యాలను పరిశీలించడంలో హైకోర్టు విఫలమైందని, నిందితుడి అనాగరికత, క్రూరత్వం, ఆర్థిక ప్రభావం, నేర ప్రవృత్తిని ఇది స్పష్టం చేస్తుందని పిటిషన్‌లో పొందుపరిచారు. బాధితురాలి తండ్రి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు నిందితుడు ఆ కుటుంబం మాట్లాడ కుండా ఉంచడానికి, న్యాయాన్ని దెబ్బతీసేందుకు బాధితురాలి తండ్రిని హత్యకు కుట్ర పన్నారని తెలిపారు. బాధితురాలి తండ్రి కస్టడీలోనే హత్యకు గురయ్యారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉన్నావ్ అత్యాచారం కేసులో కుల్దీప్ సెంగార్ జీవిత ఖైదును నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ సిబిఐ సుప్రీంకోర్టును ఆశ్రయించనుందని సిబిఐ అధికారులు తెలిపారు. మరోవైపు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీలను వారి నివాసంలో అత్యాచార బాధిత కుటుంబ సభ్యులు గురువారం కలిశారు. బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్‌కు మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్‌ను రద్దు చేయడానికి జోక్యం చేసుకోవాలని కోరారు. ఇండియా గేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలి తల్లి పట్ల పోలీసుల తీరుపై రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఒక సామూహిక అత్యాచార బాధితురాలి పట్ల ఇలా వ్యవహరించడం సమర్థనీయమేనా? అని ఆయన ప్రశ్నించారు..

బంగ్లాదేశ్ కోసం కొత్త ప్రణాళిక

- బిఎన్‌పి నేత తారిక్ రహమాన్

ఢాకా : బంగ్లాదేశ్ కోసం కొత్త ప్రణాళిక ఉందని బిఎన్‌పి నేత తారిక్ రహమాన్ గురువారం ప్రకటించారు. హింస, నిరసనలతో అస్థిరంగా మారిన బంగ్లాదేశ్‌లో గురువారం కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సుమారు 18 ఏళ్ల పాటు లండన్‌లో ఉన్న తారిక్ రహమాన్ గురువారం బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చారు. లండన్ నుంచి ఢాకాకు విమానంలో చేరుకున్నారు. ఢాకా వీధుల్లో లక్షలాది మంది బిఎన్‌పి మద్దతుదారులు ఆయనకు స్వాగతం పలికారు. పార్టీ మద్దతుదారుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. మెరుగైన బంగ్లాదేశ్‌ను నిర్మించేందుకు తనవద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందని వెల్లడించారు. కలిసికట్టుగా దానిని నిర్మించుకుందామని తారిక్ రహమాన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన తల్లి, మాజీ ప్రధాని ఖలీదా జియా అనారోగ్యం గురించి ప్రస్తావించారు. "1971లో ఒకసారి.. మళ్లీ 2024 జులైలో మరోసారి స్వాతంత్ర్యాన్ని సాధించు కున్నాం. మెరుగైన బంగ్లాదేశ్ నిర్మించేందుకు, శాంతిని తీసుకొచ్చేందుకు బిఎన్‌పి అవిశ్రాంతంగా పనిచేస్తుంది. ఈ ప్రయాణంలో అన్ని వర్గాలను కలుపుకొని వెళ్తాం. ఉస్మాన్ హాదీ (ఇటీవల హత్యకు గురైన విద్యార్థి నాయకుడు) ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ కోసం కలలు కన్నాడు. అతడి కల కోసం మా పార్టీ పనిచేస్తుంది" అని తెలిపారు. పుర్బాచల్‌లో ఈ సభ జరిగింది. ఈ సభలో మాజీ ప్రధాని హసీనా పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆమె పాలనలో ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పర్యటనకు మద్దతు ఇచ్చినందుకు తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ మ్మద్‌కు ధన్య వాదాలు తెలిపారు. అనేక సంవత్సరాలు తర్వాత స్వదేశానికి వచ్చిన ఆయన్ను పార్టీ కార్యకర్తలు చుట్టుముట్టారు. భారీగా మద్దతుదారులు రావడంతో భద్రతా సిబ్బంది ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఢాకాలో చికిత్స పొందు తోన్న తన తల్లి ఖలీదా జియా గురించి మాట్లాడుతూ.. తన మనసంతా ఆమె వద్దే ఉందని అన్నారు. ఈ ప్రసంగం అనంతరం తన తల్లిని చూసేందుకు ఆసుపత్రికి వెళ్లారు.

నేటి నుంచి రైల్వే బాదుడు

న్యూఢిల్లీ : పెరిగిన రైల్వే టిక్కెట్ ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం అధికారికంగా నోటిఫై చేసింది. 'డిసెంబరు 26న లేదా ఆ తరువాత బుక్ చేసుకున్న టిక్కెట్లపై మాత్రమే సవరించిన ఛార్జీలు వర్తిస్తాయి. ఈ తేదీకి ముందు బుక్ చేసుకున్న టిక్కెట్లకు ఎటువంటి అదనపు ఛార్జీలు ఉండవు' అని నోటిఫికేషన్‌లో తెలిపింది. ఈ నెల 21న ప్రయాణికులపై రైలు ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి ఈ ధరలు అమల్లోకి వస్తాయని కూడా తెలిపింది. ప్రయాణం 215 కిలోమీటర్లు దాటితే సాధారణ తరగతి రైలు టిక్కెట్‌ను కి.మీకు 1 పైసా, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని నాన్-ఏసి తరగతులు, అన్ని రైళ్లలో ఏసి తరగతులకు కి.మీ 2 పైసల పెంపును రైల్వే శాఖ ప్రకటించింది. 500 కిమీకు పైగా ప్రయాణించే వారిపై అదనంగా రూ.10 ఛార్జీ పెరగనున్నట్లు పేర్కొంది. రైల్వే ఛార్జీలను పెంచడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. జులైలోనూ ఛార్జీలను పెంచిన సంగతి తెలిసిందే.

అప్పలరాజుపై పీడీ యాక్ట్ రద్దు చేయాలి

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల పక్షాన నిలబడి, వారి హక్కుల రక్షణ కోసం పోరాటం చేస్తున్న ఎం. అప్పలరాజుపై పిడి యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజా నాయకుడిపై పిడి యాక్టు కింద కేసు నమోదు చేసి జైలుకు పంపడం అత్యంత దుర్మార్గమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆయన అరెస్టును ఎఐఎడబ్ల్యుయు తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. వెంటనే బేషరతుగా ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం చుట్టూ వేలాది ఎకరాల భూములు ప్రభుత్వాలు పనిగట్టుకొని కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్రకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన అప్పలరాజు సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నారని గుర్తు చేశారు. బల్క్ డ్రగ్స్, జిందాల్, ఇతర సంస్థలకు కారు చౌకగా భూముల అక్రమ కేటాయింపు, నష్టం పరిహారం పెంపుపై పోరాడు తున్నారని తెలిపారు. ప్రభుత్వ చర్యల పట్ల ప్రజలు ఎదురు తిరుగుతున్నారని అన్నారు. అప్పలరాజును పిడి యాక్ట్ కింద జైలుకు పంపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, కోట్ల విలువ చేసే భూములను కబ్జా చేయటానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్‌సిఎ క్యాంప్‌కు శ్రేయస్



బెంగళూరు: గాయపడి దీర్ఘకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా స్టార్ మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ టెస్ట్‌కు బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అడకాడమీ(ఎన్‌సిఎ)కు చేరుకున్నాడు. గురువారం బెంగళూరుకు చేరుకొని మైదానంలోకి దిగి ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్ చేశాడు. ఎన్‌సిఎ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం అతడు ఇక్కడకు చేరుకున్నాడు. ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాస్ అయితేనే అతడు దేశవాళీ క్రికెట్ విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో బరిలోకి దిగుతాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టి20 ప్రపంచకప్, దానికి ముందు న్యూజిలాండ్‌తో టి20 సిరీస్, ఏప్రిల్‌లో ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) ఉన్న క్రమంలో అతడి ఫిట్‌నెస్‌పై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. గత ఏడాది టి20 ప్రపంచకప్ సందర్భంగా శ్రేయస్ అయ్యర్ భుజానికి తీవ్రం అనంతరం శస్త్రచికిత్స చేయించుకొని మరికొంతకాలం క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు.

సినీ పరిశ్రమకు మేలు జరిగేలా చర్యలు : దుర్గేష్



'ప్రతి సినిమా బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానం కింద టికెట్ ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటాం. సినిమా పరిశ్రమ మనుగడ సాగించడంతో పాటు, సామాన్య ప్రేక్షకుడిపై భారం పడకుండా సమతుల్యత పాటిస్తాం. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటాం. పెద్ద బడ్జెట్ సినిమా, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్‌పై చర్చించి ఒక నిర్ణయానికి వస్తాం. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్ల ధరలు పెంచే విధానం పరిశీలిస్తున్నాం. త్వరలోనే డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో సమావేశం నిర్వహిస్తాం. సినీ పరిశ్రమ సమస్యలు కూడా విని పరిష్కరిస్తాం. లో బడ్జెట్, హై బడ్జెట్ సినిమాలకు ఎంత ధర ఉండాలనే అంశంపై కమిటీ చర్చిస్తోంది. ఎంత శాతం ఏపీలో చిత్రీకరణ జరపాలన్న అంశంపై నిబంధనలు నిర్ణయిస్తాం. విధానపరమైన నిర్ణయం తీసుకున్న తర్వాత కొత్త జీవో జారీ చేస్తాం. ఆంధ్రాను చలన చిత్ర నిర్మాణానికి ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం. చలనచిత్ర, టెలివిజన్ పరిశ్రమ వృద్ధిని ప్రోత్సహిస్తాం' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సృజనాత్మకశాఖామంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సచివాలయంలో తనను కలిసిన సినీరంగంలోని పలు విభాగాల ప్రతినిధులు, ఇండస్ట్రీకి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చారు. ఆంధ్రాలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం దేశంలోని పలు సినిమా పరిశ్రమల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

'ది రాజా సాబ్' క్రిస్మస్ ట్రీట్



ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ జోడీగా నటించిన చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో జనవరి 9న విడుదల కానుంది. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ' 'రాజే యువరాజే..' అంటూ సాగే పాట ప్రోమోను విడుదల చేస్తూ ట్రీట్ చేసింది. థమన్ సంగీతాన్ని అందించారు. హర్రర్ కామెడీ ఎంటర్టైనర్ గా ఈ సినిమా తెరకెక్కిన విషయం తెలిసిందే.



వేసవికి 'రేజర్' విడుదల

రవిబాబు కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రేజర్'. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ గ్లింప్స్ నిర్మాతలు విడుదల చేశారు. 'డార్క్ అండ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. పాత్ర ఇంటెన్సిటీకి తగ్గట్టుగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించేందుకు రవిబాబు సిద్ధమవుతున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. 'రవిబాబు కెరీర్‌లోనే మరో వైవిధ్యమైన ప్రయత్నంగా ఈ చిత్రం నిలుస్తుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం. వచ్చే వేసవిలో మా సినిమాను విడుదల చేస్తాం' అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఫిబ్రవరి 13న థియేటర్లలోకి 'ఫంకీ'



విశ్వక్‌సేన్, కయాదు లోహార్ జోడీగా శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించిన చిత్రం 'ఫంకీ'. వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తున్న కథానాయకుడు విశ్వక్‌సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి.అనుదీప్ కలయికలో ఈ చిత్రం వస్తోంది. ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా 'ధీరే ధీరే' తాజాగా విడుదలైంది. పాటను సంజిత్ హెగ్డే, రోహిణి సోరట్ ఆలపించగా, దర్శకుడు కె.వి.అనుదీప్ సాహిత్యం, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదల కానుంది.

దురాచారాలను దునుమాడేలా...

'మాతంగుల దుర్భర జీవితాలను పట్టిచూపుతూ 'స్పిరిట్' సినిమా (ఈజ్ నాట్ వన్) సామాజిక కోణంలో సాగుతుంది. కొందరి కబంధ హస్తాల్లో చిక్కుకున్న మాతంగుల జీవితం నిత్యం జీవచ్ఛవంగానే ఉంటుంది. సమాజ చైతన్యమే లక్ష్యంగా, విముక్తి ద్వారా మాతంతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో మా ఈ సినిమా ఆద్యంతం సాగుతుంది' అని నిర్మాత చెన్నెబోయిన వెంకటరమణ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ చిత్ర యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.



ప్రభుత్వ రంగ సంస్థల్లో...

భారీగా కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలు

- తగ్గుతోన్న శాశ్వత ఉద్యోగాలు
- ఏడాదిలో 30వేల మంది కుదింపు..!



హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీల నియామకాల్లో కాంట్రాక్టు విధానాన్ని మోడీ సర్కార్ భారీగా ప్రోత్సహిస్తోంది. శాశ్వత ఉద్యోగ నియామకాలకు కోత పెడుతూ.. భద్రత లేని కాంట్రాక్టు వ్యవస్థను పెంచుతోంది. దినసరి వేతన కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ఐదేళ్లలో ఒక్క ఏడాదిలో మినహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సిపిఎస్‌ఇ)ల్లో రెగ్యూలర్ నియామకాలు భారీగా తగ్గాయి. ఇదే సమయంలో క్యాజువల్, కాంట్రాక్టు ఉద్యోగాల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ఒక్క కరోనా ఏడాదిలో మాత్రం కాంట్రాక్టు నియమకాలు తక్కువగా నమోదయ్యాయి.

2025 మార్చి 31 నాటికి మొత్తం 475 సిపిఎస్‌ఇలు ఉండగా అందులో ప్రస్తుతం 291 సంస్థలు కార్యకలాపాలను సాగిస్తున్నాయి. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సర్వే ప్రకారం.. 2024-25 అన్ని రంగాల్లోని సిపిఎస్‌ఇలు కలిసి మొత్తం 15.42 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. 2023-24లో ఈ సంఖ్య 15.18 లక్షలుగా ఉంది. దీంతో పోల్చితే నియామకాల్లో కేవలం 1.61 శాతం పెరుగుదల మాత్రమే చోటు చేసుకుంది. ఈ స్వల్ప పెరుగుదలకు కూడా 54,000 మందికి పైగా దినసరి కూలిలు, కాంట్రాక్ట్ కార్మికులను అధికంగా తీసుకోవడమే కారణం. ఇదే సమయంలో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య దాదాపు 30,000 తగ్గడం ఆందోళకరం. ఆర్థిక సంవత్సరం 2022-23 మినహా గత ఐదేళ్లుగా ఇదే వరవడి కొనసాగింది. వేతన ఖర్చులను తగ్గించుకునే పనిలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులకు పెద్దపీట వేస్తోన్నాయి. దీనివల్ల ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్), గ్రాట్యుటీ వంటి చట్టబద్ధమైన చెల్లింపుల భారం ప్రభుత్వ సంస్థలకు తగ్గుతుంది.

కాంట్రాక్ట్ కార్మికుల ఆధిపత్యం..

గడిచిన 2024-25లో పెట్రోలియం, రిఫైనరీ రంగాల విభాగంలో అత్యధికంగా 82 శాతం మంది కాంట్రాక్ట్. దినసరి కార్మికులే ఉన్నారు. ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ రంగాల్లో 63 శాతం, విద్యుత్ ఉత్పత్తిలో 62 శాతం చొప్పున కాంట్రాక్టు ఉద్యోగులే ఉన్నారు. వీరికి అరకొర జీతాలే అందడంతో సామాజిక భద్రత కరువైందనే ఆందోళనలు ఉన్నాయి. మరోవైపు పవర్ ట్రాన్స్‌మిషన్ విభాగంలో అత్యధికంగా 91 శాతం మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండటం విశేషం.

నైపుణ్యం భళా...

సిపిఎస్‌ఇ రెగ్యులర్ ఉద్యోగాల్లో 83 శాతం లేదా 6.48 లక్షల మంది నైపుణ్యం కలిగిన వారేనని నివేదిక పేర్కొంది. పవర్ ట్రాన్స్‌మిషన్, టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో స్కిల్డ్ వర్కర్లు ఎక్కువగా ఉన్నారు. పారిశ్రామిక రంగం, కన్సూమర్ గూడ్స్, మార్కెటింగ్, బొగ్గు విభాగాల్లో తక్కువ నైపుణ్యం కలిగిన వారు ఎక్కువగా ఉన్నారు.

మహిళాల ఉపాధికి గండి...

మొత్తం ఉపాధిలో మహిళల వాటా తగ్గడం ఆందోళకరం. 2024-25లో మొత్తం సిపిఎస్‌ఇల్లో మహిళ సిబ్బంది సంఖ్య 76,685కి పడిపోయింది 2023-24లో మహిళ ఉద్యోగుల సంఖ్య 77,625గా ఉంది. సిపిఎస్‌ఇల్లో పని చేస్తున్న మహిళల్లో మూడో వంతు మంది మేనేజర్, ఎగ్జిక్యూటివ్ స్థాయిల్లో ఉండగా, 9 శాతం మంది సూపర్వైజరీ స్థాయిలో, మిగిలిన వారు వర్కర్లుగా ఉన్నారు. బొగ్గు, టెలికమ్యూనికేషన్, ఐటి, రక్షణ రంగ ఉత్పత్తి విభాగాల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు.

మంచు దుప్పటిలో మన్యం..

ప్రజాశక్తి - కురుపాం

మన్యం ప్రాంతమంతా చల్లటి గాలులు అలుముకోవడంతో గిరిజన గ్రామాలు దుప్పటి కప్పుకున్నట్టుగా కనిపిస్తున్నాయి. మం డల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామా ల్లో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగి ంది. తెల్లవారుజామున మూడు గంటల నుంచే మంచు కురుస్తుండడంతో ఎముకల వరకు చలి తాకుతుంది. ఉదయం 8 గంటల వరకు చలి తగ్గకపోగా, సాయంత్రం 4.30 నుంచి మళ్లీ చలితీవ్రత పెరుగుతోంది. తీవ్ర చలితో గ్రామస్తులు చలిమంటల చుట్టూ చేరి వేడి పుచ్చుకుంటున్నారు. మంచు కారణంగా రోడ్లపై మంచి పేరుకుపోవడంతో మైదాన ప్రాంతాల నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. చలి మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

ఇండిగో 67 విమానాలు రద్దు..

న్యూఢిల్లీ : ప్రతికూల వాతావరణం, నిర్వహణ కారణాల వల్ల 67 విమానాలను రద్దు చేసినట్లు బడ్జెట్ ఎయిర్‌లైన్స్ ఇండిగో తెలిపింది. వీటిలో 63 విమానాలు ప్రతికూల వాతావరణ సూచనల వల్ల, 4 విమానాలు నిర్వహణ కారణాల వల్ల రద్దయ్యాయని పేర్కొంది. వీటితో అగర్తలా, చండీగఢ్, డెహ్రాడూన్, వారణాసి, బెంగళూరుతో సహా పలు విమానాశ్రయాల ద్వారా సాగే కొన్ని సేవలపై ప్రభావం పడనుందని తెలిపింది. ఫిబ్రవరి 10లోపు ఈ విమానాలు రద్దయ్యాయని పేర్కొంది. ఈ నెల ప్రారంభంలో భారీగా విమానాల రద్దుతో ఇప్పటికే డిజిసిఎ పర్యవేక్షణలో ఉన్న ఇండిగోలో మళ్లీ ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

కార్ ఆఫ్ ది ఇయర్‌గా మారుతీ సుజుకి విక్టోరిస్

న్యూఢిల్లీ : మారుతీ సుజుకికి చెందిన విక్టోరిస్ 2026 ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్ (ఐసిఒటివై)గా నిలిచింది. స్కోడా కైలాక్ మొదటి రన్నరప్‌గా నిలిచింది. ఐసిఒటివై 2026 ఫైనలిస్టులలో హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, హ్యుందాయ్ వెన్యూ, కియా కారెన్స్ క్లావిస్ ఇవి, కియా సైరోస్, మహీంద్రా ఎక్స్ఇవి 9ఇ, మారుతీ సుజుకి విక్టోరిస్, స్కోడా కైలాక్, టాటా హారియర్ ఇవి ఉన్నాయి. భారతీయ ఆటోమోటివ్ నిపుణులైన సమీక్షకుల విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఐసిఒటివై జ్యూరి క్షణ్ణంగా మూల్యాంకనం చేసిన తర్వాత ఈ కార్లను షార్ట్‌లిస్ట్ చేయగా.. విక్టోరిస్‌ను కార్ ఆఫ్ ది ఇయర్‌గా నిర్ణయించారు.

ఏదిపడితే అది తేనీరు కాదు

- తేయాకులున్నదే 'టీ'
- ఎఫ్ఎస్ఎస్ఎఐ

న్యూఢిల్లీ : ఏదిపడితే అది తేనీరు కాదని, తేయాకులున్నదే తేనీరు అని జాతీయ ఆహార భద్రత, ప్రమాణాల అధీకృత సంస్థ (ఎఫ్ఎస్-ఎస్ఎఐ) స్పష్టం చేసింది. తేయాకులు (కామెల్లియా సినెన్సిస్) కాకుండా ఏ విధమైన మొక్కలు, వన మూలికల పొడులు కానీ, ఆకులు కానీ లేదా కషాయాలు కానీ 'తేనీరు (టి)' కాబోదని తేల్చిచెప్పింది. ఇలాంటి వాటిపై 'టి' అని లేబుల్ వేయడానికి వీల్లేదని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు (ఎఫ్‌బిఓ)కు ఈ నెల24న ఆదేశాలు జారీ చేసింది. రూయిబోస్ టీ, హెర్బల్ టీ, ఫ్లవర్ టీ వంటి పేర్లు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. ఇలాంటి చర్యలు చట్ట ప్రకారం నకిలీ బ్రాండింగ్‌కు సమానమని హెచ్చరించింది. ఎఫ్ఎస్ఎస్ఎఐ నిబంధనలు ప్రకారం కామెల్లియా సినెన్సిస్ ప్లాంట్ నుంచి తయారైన పానీయాలు మాత్రమే టీగా విక్రయించడానికి అర్హత పొందుతాయని తెలిపింది.

ప్రేరణ్ స్థల్‌ను ప్రారంభించిన ప్రధాని

- రూ.230 కోట్ల ప్రజాధనంతో నిర్మాణం

లక్నో : దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా లక్నోలో 'రాష్ట్ర ప్రేరణ స్థల్' పేరిట నిర్మించిన జాతీయ స్మారక కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 65 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో రూ.230 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ స్మారక కేంద్రంలో మాజీ ప్రధాని వాజ్‌పేయితో పాటు సంఫ్ పరివార్ నేతలు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్‌కు భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి 65 అడుగుల ఎత్తుతో కాంస్యంతో నిర్మించారు. అలాగే దాదాపు 98 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో బిజెపి ఎన్నికల చిహ్నమైన 'కమలం' పువ్వు నమూనాను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని గర్వకారణంగా చెప్పారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత, ప్రతి ఒక్క సానుకూల విజయాన్ని ఒకే కుటుంబానికి ఆపాదించే వైఖరి ఎలా అభివృద్ధి చెందిందో మనం ఎన్నడూ మరిచిపోరాదని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆయన ఆరోపణలు గుప్పించారు.

ఇస్లామిక్ స్టేట్ సీనియర్ నేత హతం

డమాస్కస్ : ఇస్లామిక్ స్టేట్ సీనియర్ నాయకుడు మహ్మద్ షాహదాను హతమార్చినట్లు సిరియా అధికారులు గురువారం తెలిపారు. డమాస్కస్‌కు సమీపంలో మరో ఐఎస్ నేతను అరెస్టు చేసిన గంటల వ్యవధిలోనే ఈ హత్య జరిగింది. అమెరికా నేతృత్వంలో అంతర్జాతీయ సంకీర్ణ బలగాలతో కలిసి పనిచేస్తున్న సిరియా సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ బలగాలు కచ్చితమైన లక్ష్యంతో ఈ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం మరో ఐఎస్ నేత ఒమర్ తబియాను ఆయన అనుచరులు పలువురిని అరెస్టు చేశామని చెప్పారు.

డిసెంబరు 13న జరిగిన దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు, అమెరికా పౌరుడు ఒకరు మరణించారు. ఈ దాడికి సిరియాలోని పల్మీరాలో గల ఐఎస్ గన్‌మేన్ కారణమని అమెరికా ఆరోపించింది. ఇందుకు ప్రతిగా అమెరికా బలగాలు సిరియాలోని ఐఎస్ లక్ష్యాలపై దాడులు జరిపాయి. ఆ దాడుల్లో జిహాదిస్ట్ గ్రూపునకు చెందిన ఐదుగురు మరణించారు. సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షారా నవంబరులో వాషింగ్టన్‌లో పర్యటించినపుడు ఐఎస్‌కు వ్యతిరేకంగా అమెరికా నేతృత్వంలోని సంకీర్ణంలో సిరియా అధికారికంగా చేరింది.

కిలిమంజారోలో కుప్పకూలిన హెలికాప్టర్

- ఐదుగురి మృతి

దార్ ఎస్ సలామ్ : ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతంపై హెలికాప్టర్ కూలిపోయిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. బరాపు క్యాంప్ వద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగినట్లు టాంజానియా పౌర విమానయాన అథారిటీ (టిసిఎఎ) గురువారం ధ్రువీకరించింది. మృతుల్లో ఇద్దరు చెక్‌రిపబ్లిక్ పర్యాటకులు, టాంజానియాకు చెందిన వైద్యుడు, గైడ్, ఒక జింబాబ్వే పైలట్ ఉన్నట్లు తెలిపింది. టాంజానియాకు చెందిన ఒక కంపెనీ ఈ హెలికాప్టర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఆహుతైపోయింది. ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనిపై హిరియూర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుపుతున్నామని ఐజిపి బిఆర్ రవికాంత్ తెలిపారు.

బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ మృతి చెందిన కుటుంబాలకు తమ సంతాపాన్ని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కర్ణాటక ముఖ్య మంత్రి ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. సహాయ కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఒడిశాలో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టులు మృతి
- వీరిలో అగ్రనేత గణేశ్ యుయికే కూడా..!
- ఆయన స్వస్థలం నల్లగొండ జిల్లా
- ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం



భద్రతాబలగాల కాల్పుల్లో చనిపోయిన గణేశ్..ఇతర మావోయిస్టులు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు.

భువనేశ్వర్ : మావోయిస్టుల రహిత దేశంగా మార్చడమే తమ లక్ష్యమంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' అభయారణ్యంలో మరోమారు రక్తం పారించింది. ఒడిశాలోని అటవీ ప్రాంతం తుపాకుల మోతతో దద్దరిల్లింది. కంధమాల్ జిల్లాలో గురువారం ఉదయం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో సిపిఐ (మావోయిస్టు) సంస్థకు చెందిన కేంద్ర కమిటీ సభ్యులు, ఒడిశా ఆపరేషన్స్ అధిపతి గణేశ్ యుయికే (69) కూడా ఉన్నారు. మంగళవారం నుంచి ఈ ఎదురుకాల్పులు కొనసాగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ ఎన్‌కౌంటర్ ఘటనపై స్పందించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. 'మావోయిస్టు రహిత భారత్' దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన ప్రధాన ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ యుయికే సహా ఇప్పటి వరకు ఆరుగురు మావోయిస్టులు మరణించారు' అని ఆయన పేర్కొన్నారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో గల కంధమాల్ జిల్లా బెల్ఘర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు కోటగడ్‌లో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపు గాలింపు చర్యలు చేపట్టిందని పోలీసులు చెప్పారు. మొత్తం 23 టీమ్‌లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయనీ, అందులో 20 స్పెషల్ ఆపరేషన్ టీమ్స్, రెండు సీఆర్పీఎఫ్ బృందాలు, ఒక బిఎస్ఎఫ్ టీమ్ ఉన్నాయని వివరించారు. మృతుల్లో గణేశ్ యూయికేతో పాటు రాయగఢ్ ఏరియా కమిటీ సభ్యులు బారి ఎలియాస్ రాకేశ్, మరో మావోయిస్టు అమృత్‌గా గుర్తించారు. మిగతా ఇద్దరిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. ఘటన స్థలం నుంచి మృతదేహాలను, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

గణేశ్ స్వస్థలం నల్లగొండ

గణేశ్‌ది తెలంగాణలోని నల్లగొండ చండ్రూర్ మండలంలోని పుల్లెంల గ్రామం. నిషేధిత మావోయిస్టు పార్టీలో క్రియాశీలంగా ఉన్న కొద్ది మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో ఈయన ఒకరని అధికారులు చెప్పారు. గణేశ్ ఉయికే తలపై రూ.1.1 కోట్ల రివార్డు ఉండగా.. బారి తలపై రూ.22 లక్షలు, అమృత్ తలపై రూ.1.65 లక్షల రివార్డు ఉన్నదని వివరించారు. గత మూడేండ్లుగా గూఢచార సంస్థల సమాచారం ఆధారంగా భద్రతా దళాలు మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి.

ఒకప్పుడు ఈ సంస్థలో 21 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఉండగా.. ప్రస్తుతం వారి సంఖ్య ఐదుకంటే తక్కువకు తగ్గిందని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

మావోయిస్టులపై తుపాకీ ఎక్కుపెట్టిన మోడీ సర్కారు

కేంద్రంలోని మోడీ సర్కారు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెట్టుకున్నదని పౌర హక్కుల సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా భద్రతా బలగాలు మావోయిస్టుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌ను జల్లెడ పడుతున్నాయని తెలిపారు. ఈ నెల 3, 4 తేదీలలో భద్రతా దళాలు దంతెవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో జరిపిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 18 మంది మావోయిస్టులను పోలీసులు పొట్టనపెట్టుకున్నారని వాపోయారు.

దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె

- ఈ నెల 31 వరకు నిలిచిపోనున్న డెలివరీ సేవలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న గిగ్ వర్కర్లు (డెలివరీ బాయ్స్) తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రముఖ ఫుడ్ డెలివరీ ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లైన స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలలో పనిచేస్తున్న డెలివరీ పార్టనర్స్ ఈ నిరసనలో పాల్గొంటున్నారు. ఈ సమ్మెను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఎటి), తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు)లు సంయుక్తంగా గురువారం ప్రకటించాయి. ఇది డిసెంబర్ 25 (క్రిస్మస్) నుండి ప్రారంభమై డిసెంబర్ 31 (న్యూ ఇయర్) వరకు కొనసాగనుంది. ముఖ్యంగా పండుగ సీజన్ , సెలవు దినాల్లో డెలివరీలకు విపరీతమైన డిమాండ్ ఉండే సమయంలో సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రధాన నగరాల్లో డెలివరీ సేవలు నిలిచిపోనున్నాయి..

సామాజిక భద్రతను కల్పించండి..

గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, వారికి పిఎఫ్ , ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించాలని వారు కోరుతున్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా డెలివరీ ఛార్జీలను పెంచాలని , ప్రతి ఆర్డర్‌పై గౌరవప్రదమైన ఆదాయం కల్పించాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. పని చేసే సమయంలో డెలివరీ బాయ్స్‌కు భద్రతను కల్పించాలని, సమగ్ర ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కంపెనీల ఏకపక్ష నిర్ణయాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన నిబంధనలను అమలు చేయాలని యూనియన్లు కోరుతున్నాయి. పని పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని, కంపెనీలు కేవలం లాభాలకే ప్రాధాన్యత ఇస్తూ వర్కర్ల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని యూనియన్ నేతలు విమర్శించారు. "అర్ధరాత్రి వరకు, ఎండనక వాననక కష్టపడుతున్న మాకు కనీస గౌరవం కానీ, భద్రత కానీ లేదు. అందుకే ఈ పోరాటం అనివార్యమైంది" అని ఒక యూనియన్ ప్రతినిధి పేర్కొన్నారు. సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీని సమర్థవంతంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న లక్షలాది మంది భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్లాట్‌ఫామ్ కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరుతున్నారు. అయితే సమ్మె నేపథ్యంలో వినియోగదారులు తమ ఆర్డర్ల విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉసురు తీస్తున్న విద్వేషాగ్ని

- ఒడిషాలో బెంగాల్ కార్మికులపై మూక దాడి
- ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు

భువనేశ్వర్ : బంగ్లాదేశ్ పరిణామాలను సాకుగా చేసుకొని దేశవ్యాప్తంగా ముస్లిం పట్ల సంఫ్ పరివార్ నాయకులు విద్వేషాగ్ని రాజేస్తున్నారు. దీంతో అనేక చోట్ల మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని మూకదాడులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఒడిషాలోని సంబల్‌పూర్ పట్టణంలో కొందరు దుండగులు బెంగాల్ కార్మికులపై మూక దాడికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటనలో ఒకరు చనిపోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బంగ్లాదేశీయులుగా అనుమానిస్తూ వలస కార్మికులపై విద్వేషకారులు ఈ దాడికి పాల్పడ్డారు. కార్మికులను గుర్తింపు కోసం ఆధార్ కార్డులు అడిగి, వాటిని వారు తీసుకొనిరావడానికి వెళుతుండగా వెనుకనుంచి కర్రలతో దాడి చేశారు. ఆపకుండా కొట్టారు. దీంతో ఒక కార్మికుడి మృతి చెందగా, మరొ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడి గురించి కార్మికులను పనికి తీసుకొచ్చిన కాంట్రాక్టర్ హక్ సాహెబ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన కొంత మంది భవన నిర్మాణ కార్మికులు కొంతకాలంగా సంబల్‌పూర్ పట్టణంలో పనిచేస్తున్నారు. వీరిలో ముగ్గురు బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో టీ తాగడానికి బయటకు వచ్చారు. వీరిని దాదాపు పది మందితో కూడిన విద్వేషకారులు గుంపు అడ్డగించింది. బంగ్లాదేశీయులు అని కార్మికులను ఎగతాళి చేశారు. భారత్‌కు చెందిన వారయితే గుర్తింపు కోసం ఆధార్ కార్డులు చూపించాలని అడిగారు. దీంతో కార్మికులు అధార్ కార్డులు కోసం తిరిగి వెళుతుండగా వారి తలపై కర్రలతో కొట్టడం ప్రారంభించారు. ఈ దెబ్బలతో 20 ఏళ్ల జువల్ రాణా అనే కార్మికుడు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాము దాదాపు 13 ఏళ్ల నుంచి సంబల్‌పూర్‌లో ప్రశాంతంగా పనిచేస్తున్నామని, కానీ ఒడిషాలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి హింస, దాడులు పెరిగాయని కాంట్రాక్టర్ సాహెబ్ తెలిపారు. ఈ దాడిపై సంబల్‌పూర్‌లోని అయింతపాలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయిందని ఐజి హిమాన్షు లాల్ ఒక మీడియా ప్రకటనలో తెలిపారు. నిందితుల్ని అరెస్టు చేశామని, విచారణ కొనసాగుతోందని చెప్పారు. కాగా, ఒడిషాలోని బిజెపి ప్రభుత్వం కూడా వలసకార్మికులపై వేధింపులకు పాల్పడుతోంది. ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టి మైనార్టీలుగా కనిపించేవారందరినీ బంగ్లాదేశీయులుగా ముద్ర వేస్తూ వేధింపులకు గురి చేస్తోంది. ఆగస్టు నెలలో ఝార్సుగూడ జిల్లాలో అక్రమ వలసదారులనే అనుమానంతో 444 మందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ధ్రువీకరణ తరువాత వీరంతా పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కార్మికులుగా వెల్లడయింది.

బెదిరింపుల జాడ్యాన్ని అమెరికా విడనాడాలి

- వెనిజులాలో ఉద్రిక్తతలు తగ్గించాలి
- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి భేటీలో సభ్య దేశాల ఉద్ఘాటన



ఐక్యరాజ్యసమితి : అమెరికా ఇతర దేశాల విషయంలో బెదిరింపుల వైఖరిని విడనాడాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని సభ్యదేశాలు ఉద్ఘాటించాయి. వెనిజులాపై వివిధ రూపాల్లో అమెరికా బెదిరింపులకు గురి చేస్తున్న నేపథ్యంలో భద్రతా మండలి మంగళవారం అత్యవసరంగా సమావేశమైంది. వెనిజులాలో అమెరికా ప్రేరేపిత ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని సమావేశంలో ముక్తకంఠంతో సభ్యదేశాలు డిమాండ్ చేశాయి. ఐక్యరాజ్యసమితి నిబంధనావళిని గౌరవించాలని మెజారిటీ భద్రతా మండలి సభ్య దేశాలు కోరాయి. అమెరికా బెదిరింపుల జాడ్యం వెనిజులాతో ఆగదని, ఇతర దేశాలకూ విస్తరిస్తుందని ఐక్యరాజ్యసమితిలో వెనిజులా శాశ్వత ప్రతినిధి శామ్యూల్ మోంకాడా అకోస్టా వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన ఈ లక్ష్యం ఇప్పటికే ఖండాంతర స్థాయిలో విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి నిర్మాణంలో, నిబంధనావళి రూపకల్పనలో అవిభాజ్యమైన దేశంగా వున్న అమెరికా, ఈ రోజు పశ్చిమార్ధ అర్ధగోళంలో అన్ని దేశాల ప్రాథమిక హక్కులను కాలరాసేలా తన గుప్పిట్లో బంధించాలని చూస్తోందన్నారు. తద్వారా అంతర్జాతీయ చట్టాలకు, శాంతి, భద్రతలకు ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు.

వెనిజులా చమురు ట్యాంకర్లను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడాన్ని, మొత్తంగా వెనిజులాపై నౌకాదళ ఆంక్షలు విధించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా అన్నారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన అన్ని నిబంధనలను, ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నాయన్నారు. చైనా డిప్యూటీ శాశ్వత ప్రతినిధి సన్ లెయి మాట్లాడుతూ, వెనిజులాపై సాగిస్తున్న బెదిరింపుల పర్వాన్ని తక్షణమే ఆపాలని అమెరికాను డిమాండ్ చేశారు. అమెరికా చర్యలు, వైఖరి వల్లనే ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయన్నారు. ఏకపక్ష చర్యలను, బెదిరింపులను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అన్ని దేశాలు వారి సార్వభౌమాధికారాన్ని, జాతీయ సమగ్రతను పరిరక్షించుకోవడానికి మద్దతునిస్తుందని స్పష్టం చేశారు.

వాజ్‌పేయి హయాంలోనే పిపిపి

(మొదటి పేజీ తరువాయి)

విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. మోడీ, చంద్రబాబు ఇద్దరు కలిసి వికసిత్ భారత్‌కు మార్గదర్శకత్వం వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్రమంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ, ఎంపి సిఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమంలా ప్రభుత్వం కార్యక్రమం

రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆద్యంతం బిజెపి ఆధ్వర్యాన నడిచినట్లు సాగింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, నాయకులు పాతూరి నాగభూషణం తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. ఈ నెల 11వ తేదీ నుంచి బిజెపి ఆధ్వర్యాన అటల్ మోడీ సుపరిపాలన యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ యాత్రకు సంబంధించిన చిత్రాలను కూడా ప్రదర్శించారు.

కార్యక్రమానికి పవన్ కల్యాణ్ గైర్హాజరు

మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దూరంగా ఉండటం కూటమిలో చర్చనీయాంశంగా మారింది. కూటమిలో పవన్ కల్యాణ్ భాగస్వామిగా ఉన్నారు. వాజ్‌పేయి గురించి అనేక సందర్భాల్లో గొప్పగా చెప్పే పవన్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. బుధవారమే ఇప్పటంలో కూడా పవన్ పర్యటించారు. ఈ రోజు విగ్రహావిష్కరణ కార్యక్రమం గురించి తెలిసినా ఆయన హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని కారణాల వల్ల పవన్ కల్యాణ్ హాజరు కాలేకపోయారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారే తప్ప నిర్దిష్ట కారణం చెప్పలేదు. ప్రతి నాయకుడూ వాజ్‌పేయి నుంచి ప్రేరణ పొందాలని పవన్ ట్విట్టర్‌లో నివాళులర్పించడం గమనార్హం.

ఉత్తర కొరియా తొలి అణుశక్తి జలాంతర్గామి

- క్షిపణులనూ ప్రయోగించగల సామర్థ్యం
- కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పర్యవేక్షణ



ప్యాంగ్యాంగ్: అణుశక్తితో నడిచే జలాంతర్గామి నిర్మాణం పూర్తయిందని ఉత్తర కొరియా అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ అధికారిక వార్తా సంస్థ 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' (కెసిఎన్ఎ) కీలక వివరాలను, చిత్రాలను గురువారం విడుదల చేసింది. ఇది సుమారు 8,700 టన్నుల బరువు కలిగిన భారీ జలాంతర్గామి. దీన్ని స్ట్రాటజిక్ గైడెడ్ మిస్సైల్ సబ్‌మెరైన్‌గా ఉత్తర కొరియా ప్రకటించింది. ఇది అణు ఆయుధాలను మోసుకెళ్లడమే కాకుండా, ఉపరితలం నుండి గగనతలంపై క్షిపణులను కూడా ప్రయోగించగలదు. అణుశక్తితో నడిచే జలాంతర్గాములు నీటి అడుగున ఎక్కువ కాలం ఉండగలవు. శత్రువుల రాడార్లకు చిక్కకుండా సుదూర ప్రాంతాలకు ప్రయాణించగలవు. ప్రపంచంలోని అగ్రరాజ్యాల వద్ద ఉన్న భారీ జలాంతర్గాముల కంటే పెద్ద పరిమాణాన్ని కలిగి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆయన తన కుమార్తెతో కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. తమ దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచడంలో ఈ అణు జలాంతర్గామి కీలక పాత్ర పోషిస్తుందని, సైనిక ఆధునీకరణలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఉత్తర కొరియా ప్రభుత్వం పేర్కొంది.

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటే పరిష్కార మార్గం

- క్రిస్మస్ సందేశంలో పోప్
- పాలస్తీనియన్ల దుస్థితి పట్ల తీవ్ర ఆవేదన

వాటికన్ సిటీ : గాజాలో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న దుస్థితిపై పోప్ లియో తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య దశాబ్దాలుగా సాగుతున్న ఈ ఘర్షణకు ఏకైక పరిష్కారం స్వతంత్ర పాలస్తీనా ఏర్పడడమేనని ఆయన పునరుద్ఘాటించారు. ఇటీవల కాలంలో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆయన పలుసార్లు ఆవేదన వెలిబుచ్చారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా చేసిన ప్రసంగంలో ఆయన తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా ఆధ్యాత్మికత, సేవా భావం ప్రధానంగా సాగే ఈ ప్రసంగంలో ఈసారి అయన పాలస్తీనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. పశువుల పాకలో ఏసు జన్మించిన కథను మనం గుర్తు చేసుకున్నపుడు గాజాలో వారాల తరబడి వర్షాలు, గాలులు, చలికి ఇబ్బందులు పడుతున్న ప్రజల గురించి ఆలోచించకుండా ఎలా వుండగలం? అని ఆయన ప్రశ్నించారు. పోప్ ఫ్రాన్సిస్ స్థానంలో అమెరికాకు చెందిన లియో పోప్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగించారు. గతంలో పోప్ ప్రసంగాల్లో ఎన్నడూ రాజకీయ ప్రస్తావనలు వుండేవి కావు. వాటికి భిన్నంగా లియో ప్రసంగం సాగింది. సెయింట్ పీటర్స్ బాసిలికాలో వేలాదిమంది మధ్య గురువారం సాగిన ఈ ప్రసంగంలో లియో, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాల వల్ల జరుగుతున్న వినాశనం, విధ్వంసంతో ప్రపంచవ్యాప్తంగా ఇల్లూ వాకిలి లేకుండా నిరాశ్రయులుగా ఇబ్బందులు పడుతున్న వేలాదిమంది ఎదుర్కొంటున్న పరిస్థితుల పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి రక్షణ లేని ప్రజల జీవితాలను ఈ యుద్ధాలు అత్యంత దయనీయంగా మారుస్తున్నాయన్నారు. వారు శిథిలాల్లో గాయాలతో జీవితాలను వెళ్ళమార్చాల్సి వస్తోందని ఆందోళన వెలిబుచ్చారు.



అచ్యుతరామయ్యను సత్కరిస్తున్న బివి.రాఘవులు, వి.శ్రీనివాసరావు, జాన్‌వెస్లీ తదితరులు

అచ్యుతరామయ్య జీవితం ఆదర్శనీయం

- ఆయన అనుభవాలను రికార్డు చేయాలి
- అచ్యుతరామయ్య వందో పుట్టిన రోజు వేడుకల్లో బివి రాఘవులు, వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అచ్యుతరామయ్య జీవితం ఆదర్శనీయమని, వందేళ్లు వచ్చినా నమ్మిన సిద్ధాంతం కోసం నేటికీ కట్టుబడి ఉన్న అరుదైన వ్యక్తుల్లో ఆయన ఒకరని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అచ్యుతరామయ్య వందో పుట్టిన రోజు వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు, సిపిఎం నేతల మధ్య జరిగింది. ఈ సందర్భంగా అచ్యుతరామయ్యతో కేక్‌ను కట్ చేయించారు. శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ నిరంతరం పనిచేయడం వల్ల ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుందని తెలిపారు. అచ్యుతరామయ్యకు పనిమీద ధ్యాస ఎక్కువని, తనకు అప్పగించిన బాధ్యతలను ఎన్నడూ విస్మరించలేదని గుర్తుచేశారు. భారతదేశంలో తొలి కమ్యూనిస్టు సమావేశం జరిగిన ఏడాదే అచ్యుతరామయ్య పుట్టారని తెలిపారు. యుక్తవయస్సులో స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుగా పాల్గొన్నారని, ఆ తర్వాత తిరువూరు కేంద్రంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాలుపంచుకున్నారని, ఆంధ్రా, తెలంగాణ ఉద్యమాలను దగ్గర నుంచి చూశారని వివరించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, ఒత్తిళ్లు వచ్చినా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్న గొప్ప వ్యక్తి అని తెలిపారు. కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలతో పోలిస్తే ఉద్యమ సాహిత్యాన్ని సంగ్రహించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వెనుకంజలో ఉన్నాయని, అందుకే ఉద్యమ చరిత్ర పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఉద్యమ అనుభవాలను పుస్తకరూపంలో లిఖిస్తేనే భవిష్యత్తు తరాలకు చరిత్ర అందుతుందని తెలిపారు.

సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు సంఘంలో అచ్యుతరామయ్యతో కలిసి పనిచేసిన కాలాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయనను కలిసిన ప్రతిసారీ ఉత్తేజం వచ్చేదన్నారు. అంకితభావం, కష్టపడే తత్వాన్ని నేటి యువనాయకులు ఆయన నుంచి నేర్చుకోవాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం బలం పుంజుకునే రోజులు రాబోతున్నాయన్నారు. సోషలిస్టు వ్యవస్థ పట్ల యువతలో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. నేటి యువ నాయకులు అచ్యుతరామయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత అధ్యక్షులు బి.వెంకట్, అచ్యుతరామయ్య కుమార్తెలు వనజ, శారద, ఉమ, అల్లుళ్లు చంద్రశేఖర్, హరి, మనువడు విశ్వనాథ్‌సాయి, మనువరాలు సౌమ్య, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన హిందుత్వ శక్తులు

(మొదటి పేజీ తరువాయి)

అధికంగా నమోదైనట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భజరంగ్‌దళ్ దాడులు

ఛత్తీస్‌గఢ్‌లో హిందూత్వ సంస్థ భజరంగ్‌దళ్ క్రిస్మస్ వేడులకు ఆటంకం కలిగించింది. రాయ్‌పూర్‌లోని మాగ్నెటో మాల్ వద్ద ఆ సంస్థ కార్యకర్తలు క్రిస్మస్ అలంకరణలను ధ్వంసం చేసింది. దాదాపు 30 మందికి పైగా వచ్చిన భజరంగ్‌దళ్ కార్యకర్తలు.. రెచ్చగొట్టే చర్యలకు దిగారు. ద్వేష పూరిత నినాదాలు చేశారు. మాల్ ముందు ఏర్పాటు చేసిన శాంతాక్లాజ్ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనలతో ప్రజలు ముఖ్యంగా మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారు.

యుపిలో చర్చ్ ఎదుట హనుమాన్ చాలీసా పఠనం

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ పట్టణంలో హిందూత్వ సంస్థలు రెచ్చగొట్టే చర్యలకు దిగాయి. ఆ సంస్థకు చెందిన పలువురు కార్యకర్తలు ఓ చర్చి ఎదుట హనుమాన్ చాలీసాను పఠించారు. బరేలీలోని ఒక ప్రసిద్ధ చర్చిలో వేడుకలకు ముందు వారు ఈ చర్యకు దిగారు. అయితే ఇదంతా పోలీసు సిబ్బంది సమక్షంలోనే జరగడం గమనార్హం. అంతేకాదు.. 20 మందికి పైగా హనుమాన్ చాలీసా, జైశ్రీరామ్ వంటి నినాదాలు చేస్తూ రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో హిందూత్వ సంస్థల తీరు, భద్రత కల్పించలేని యోగి సర్కారు వైఖరిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబట్టారు.

అసోంలో 'జైశ్రీరామ్' నినాదాలు..

అసోంలోని నల్బారి జిల్లాలో గల సెయింట్ మేరీస్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్న విషయాన్ని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వంటి హిందూత్వ సంస్థలు తెలుసుకున్నాయి. ఈ సంస్థలకు చెందిన కార్యకర్తలు పాఠశాలలోకి చొచ్చుకెళ్లారు. జైశ్రీరామ్, జై హిందూ రాష్ట్ర వంటి నినాదాలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన అలంకరణలను ధ్వంసం చేసి, నిప్పంటించినట్టు సమాచారం. వారు దాడులకు కూడా దిగినట్టు తెలుస్తున్నది.

బిజెపి సర్కారు అండ.. హిందూత్వ శక్తుల దాడులు

దేశవ్యాప్తంగా పలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాల అండతో హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. క్రిస్మస్ వేడుకలకు ఆటంకాన్ని సృష్టించాయి. అనేక ఘటనల్లో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారనీ, సంఫ్ పరివార్ సంస్థల చర్యలను అడ్డుకునే ప్రయత్నాలను కూడా చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. బిజెపి ప్రభుత్వాల మద్దతుతోనే హిందూత్వ శక్తులు క్రిస్మస్‌రోజున రెచ్చగొట్టే చర్యలకు దిగాయనీ, ఇది క్రైస్తవ సమాజాన్ని ఆందోళనకు గురి చేసిందని పలు క్రైస్తవ సంఘాలు, జర్నలిస్టులు, మేధావులు వివరించారు.

చర్చిలో మహిళపై దాడిలో బిజెపి నేతపై చర్యలేవి?

బిజెపి పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో కొన్ని రోజుల క్రితం ఒక చర్చిలో చూపులేని యువతిపై బిజెపి నాయకులు కొందరు రెచ్చిపోయారు. ఆమెపై దాడికి దిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అంజు భార్గవ, ఇతరుల పేర్లు ఈ ఘటనలో వినిపించాయి. అయినప్పటికీ.. వారిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన దాడులకు పాల్పడిన హిందూత్వ చర్యలను పలు క్రైస్తవ సంఘాలు ఖండించాయి. ఇలాంటి సంఘ విద్రోహక చర్యలను అడ్డుకోవాల్సిన ప్రభుత్వాలే.. అగ్నికి ఆజ్యం పోసే విధంగా వ్యవహరించాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి.

నూతన ఆర్థిక విధానాలు

పెల్లుబికిన కార్మికవర్గ ప్రతిఘటన

ఎనభయ్యవ దశకం మలి దశలో కాంగ్రెస్ ప్రభుత్వం తలకెత్తుకున్న నూతన ఆర్థిక విధానం ప్రైవేట్ ఉత్పత్తులు, పెట్టుబడులకు పెద్దపీట వేసింది. పారిశ్రామిక రుగ్మత, రిట్రెంచ్‌మెంటు, లే ఆఫ్‌లు, లాకౌట్లు, భయంకరమైన నిరుద్యోగం, కార్మిక వ్యతిరేక చట్టాలు ప్రధాన భాగాలైన ఈ విధానాల ప్రభావం కార్మికులపై తీవ్రంగా పడింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాలలోనూ పోరాటాలకు దారితీసింది. ప్రభుత్వం కఠినమైన అణచివేత చర్యలకు పూనుకున్నప్పటికీ ఏమాత్రం లెక్కచేయక కార్మికలోకం పోరు సాగించింది.

ప్రభుత్వ రంగాన్ని క్రమక్రమంగా ప్రైవేటీకరించే కాంగ్రెస్ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పబ్లిక్ రంగ ఉద్యోగులు ఈ కాలంలో ముమ్మర పోరాటాలకు దిగారు. మెడికల్ బెనిఫిట్లు, భద్రతా చర్యల ఉల్లంఘన, గ్రాట్యుటీ మీద సీలింగ్ పెంపుదల, పెన్షన్ పథకం, పరిశ్రమ మొత్తానికి ఒకే విధమైన స్టాండింగ్ ఆర్డర్లు, కార్మికుల మీద ఆధారపడిన వారికి ఉద్యోగ కల్పన వంటి సమస్యలతో పాటు, ఒప్పందంలో అమలు కాని ఇతర అంశాలను తమ డిమాండ్లలో చేర్చారు. 'నూతన జౌళి విధానం' అమలు ఫలితంగా పెద్ద సంఖ్యలో మిల్లులు మూతపడటంతో టెక్స్‌టైల్ కార్మికులు ఆర్థిక డిమాండ్లు, ఉద్యోగ భద్రత అనే రెండు ప్రధాన అంశాల మీద పోరాటాలకు పూనుకున్నారు. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ లేబర్ యూనియన్ సైతం దశలవారీ కార్యక్రమాలను చేపట్టింది. దాదాపు అన్ని రంగాల కార్మికులు ఈ కాలంలో వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తూనే వున్నారు. పోర్ట్ అండ్ డాక్ వర్కర్లు, వివిధ పబ్లిక్, ప్రైవేట్ రంగ కార్మికులు, తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాట పథాన సాగారు. ఈ సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో తేయాకు తోటల కార్మికులు సాగించిన సమ్మెను ప్రత్యేకంగా ప్రస్తావించాలి.


చెక్కుచెదరని ఐక్యతా పోరాటాలు

ఈ కాలంలో వేర్పాటువాద శక్తుల ఆందోళనలు పెచ్చరిల్లి, మతతత్వ వేర్పాటువాద శక్తుల దాడులు తీవ్రమైనప్పటికీ, కార్మిక వర్గ ఐక్యత చెక్కుచెదరలేదు. అంతేగాక ప్రభుత్వ విధానాలను కార్మికవర్గం అమోఘంగా ప్రతిఘటించి పోరాడింది. జనవరి 21వ తేదీ పబ్లిక్ రంగ ఉద్యోగుల బ్రహ్మాండమైన సమ్మెతో 1987వ సంవత్సరం ప్రారంభమైంది. ఈ సమయంలోనే, ఇతర రంగాలలోని కార్మికులు, ఉద్యోగులు కూడా తమ తమ రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి ఐక్యంగా కృషి చేశారు.

కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం కార్మికవర్గ ప్రతిఘటనను నిర్వీర్యం చేయటానికి ఒక నూతన కార్మిక చట్టాన్ని ప్రవేశపెట్టాలని, ట్రేడ్ యూనియన్ల నుండి బయట వ్యక్తులను తొలగించాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను కూలదోసే ప్రయత్నాలను ప్రభుత్వం కొనసాగిస్తున్న సమయంలోనే...నూతన ఆర్థిక విధానాల దాడుల నుండి ప్రభుత్వ రంగ మందుల పరిశ్రమను కాపాడాలని కోరుతూ, కార్మిక సంఘాలు 1987 జూన్ 1 నుండి 7 వరకు 'కోర్కెల వారా'నికి పిలుపునిచ్చాయి. కేంద్ర ఉద్యోగులతో సమాన స్థాయిలో రాష్ట్ర ఉద్యోగులకు వేతనాలివ్వాలనే డిమాండ్‌తో అనేక రాష్ట్రాలలో సమ్మె పోరాటాలు ప్రారంభమైనాయి. 1988 మార్చి నెల మొత్తం ప్రభుత్వ కార్మిక, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సమ్మెలు, సార్వత్రిక సమ్మెలతో అట్టుడికిపోయింది. దేశంలోని బొగ్గు గని కార్మికులు 1988 మార్చి 20 నుంచి 25 వరకు మరల 6 రోజుల సమ్మె చేశారు. అందులో దాదాపు 7 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఎస్మా చట్టాన్ని అమలు చేసి, 6 నెలల కారాగారవాస శిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానా లేదా రెండు శిక్షల అమలుకు... ఒకరోజు సమ్మె చేస్తే 8 రోజుల జీతం కోత, డిస్మిసల్ వంటి అణచివేత చర్యలకు పూనుకున్నప్పటికీ సమ్మె విజయవంతమైంది.

దేశంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ రంగాల్లోనూ ఫ్యాక్టరీల మూసివేతలు, లాకౌట్లు, టెక్స్‌టైల్ కార్మికులను పనుల నుండి తొలగించడం, నూతన జీవన వ్యయ సూచి ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్మిక వర్గం మీద దాడులకు పూనుకుంది. దీంతో సిఐటియు పిలుపు మేరకు బొంబాయిలో దాదాపు లక్షమంది కార్మికులు 1989 మే 17న సమ్మె చేశారు. మూతపడిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, జనపనార పరిశ్రమను జాతీయం చేయాలనీ, తదితర డిమాండ్ల సాధనకు 1989 ఆగస్టు 30వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో బంద్, సార్వత్రిక సమ్మె జరిగాయి. తమ 32 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధనకు ఆలిండియా రిజర్వ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు 1989 జూన్ 9న ఒక రోజు సమ్మె పాటించారు.

రాజ్యాంగంలోని అప్రజాస్వామిక 310, 311 (2)ఎ బి.సి అధికరణాలను రద్దు చేయాలని, జాతీయ వేతన విధానం తీసుకురావాలని కోరుతూ ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 1990 సెప్టెంబర్ 6,7 తేదీల్లో న్యూ ఢిల్లీలో జాతీయ సెమినార్ జరిగింది. ఈ కాలంలో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో జరిగిన ప్రధాన ఘటనల్లో ఇది ఒకటి.



1985లో రాజీవ్ గాంధీ ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాలను ఆ తర్వాత ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. నరేంద్రమోడి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మరింత వేగంగానూ, శక్తివంతంగానూ ఈ విధానాలను అమలు చేస్తోంది.

అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల షరతులను అనుసరించి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రారంభమైన పోరాటం...భారత కార్మికోద్యమ పోరాట చరిత్రలో ఒక అపూర్వమైన అధ్యాయంగా నిలుస్తుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

తొలినాళ్లలో రాష్ట్రంలో కార్మికోద్యమం (1936-42)

సమగ్ర శాసనం కోసం...

రాష్ట్రంలో 1930వ దశాబ్దం ప్రారంభం నుండి పారిశ్రామికాభివృద్ధి క్రమంగా వేగం పుంజుకుంది. పరిశ్రమల సంఖ్యతో పాటే కార్మికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే, దీనికి తగ్గట్టుగా కార్మికుల రక్షణకు సమగ్రచట్టాలు లేవు. ఫ్యాక్టరీ యాక్టు వంటి ఒకటి, రెండు చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలైన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. వేతనాల నుండి పని ప్రదేశాల్లో భద్రత వరకు ఒక్క అంశం కూడా అమలులోకి రాకపోవడంతో కార్మికుల పరిస్థితి ఘోరంగా మారింది. దీంతో కార్మికులను సంఘటితం చేసి,వారి హక్కుల పరిరక్షణ కోసం సమగ్ర శాసనం రూపొందించాలన్న డిమాండ్ ప్రారంభమైంది. సహజంగానే కమ్యూనిస్టు పార్టీ ఈ కృషిని భుజాన వేసుకుంది. కార్మికుల్లో విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించింది. కార్మికులకు భద్రత, కనీస సౌకర్యాలు, హక్కులు, ఉద్యోగ భద్రత, పనిగంటలు, కార్మిక సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు తదితర అంశాలను ఈ శాసనం చేర్చాలంటూ కమ్యూనిస్టులు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. దీంతో 1937లో మద్రాసు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రివర్గం కార్మిక సమస్యలపై తన ఆలోచనలను తెలియచేస్తూ ఒక ప్రకటన చేసింది. కార్మిక వివాదాల్లో ఇరు పక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దీనిలో పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేయాలని, సంప్రదింపులకు అవకాశం ఇవ్వాలని, తక్షణమే ప్రత్యక్ష ఆందోళనలకు దిగకూడదని కూడా సూచించింది. అయితే, ఈ ప్రకటన కార్మికులకు ఎటువంటి ఊరట ఇవ్వలేకపోయింది. యజమానులు కూడా ప్రభుత్వ ప్రకటనను ఖాతరు చేయకుండా కార్మికులను దోపిడి చేసేందుకే ప్రయత్నించారు. అనేక చోట్ల కార్మిక సంఘాలను సైతం గుర్తించలేదు. దీంతో కార్మికుల ఆందోళనలు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికెళ్లినా ఈ చట్టం గురించే కార్మికులు ప్రశ్నించేవారు. ఈ పరిస్థితుల్లో కార్మిక శాసనం రూపొందించడానికి మద్రాసు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అప్పటికే ఉనికిలో ఉన్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చించుకుని విశాల ప్రాతిపదికన ఒక నివేదికను రూపొందించారు. 1939 మే 12న అప్పటి కార్మిక మంత్రి వివి గిరిని కలుసుకుని ఆ నివేదికను అందచేశారు. ఆ నివేదికలోని అంశాలను శాసనంలో పొందుపర్చాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం, వృద్ధాప్యం, అనారోగ్యం, అనాధ స్థితిలో ఉన్న కార్మికులకు జీవనోపాధి ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని షరతులను నిర్ధారించాలని, షాపు, అసిస్టెంట్ సర్వీసు షరతులను న్యాయ సమ్మతంగా అమలు చేయాలన్నవి తక్షణ డిమాండ్లుగా ఈ నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఎటువంటి శాసనం రూపొందించకుండానే 1939లో కాంగ్రెస్ మంత్రివర్గం యుద్ధం కారణంగా రాజీనామా చేసింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

లేబర్‌కోడ్‌లు

అసత్య ప్రచారాలు ...వాస్తవాలు

ప్రచారం	వాస్తవం
● పారిశ్రామిక వివాదాలకు వేగవంతమైన, మెరుగైన పరిష్కారం	● సమ్మెలు చట్ట విరుద్ధం ● సమ్మె చేయాలంటే 60 రోజుల ముందు నోటీసు ● గుర్తింపు ఎన్నికలను నామమాత్రం చేసే అవకాశం ● నియమాకాలు, తొలగింపులు, స్టాండింగ్ ఆర్డర్లు మార్చే అధికారం ఏకపక్షంగా యజమానులకే అప్పగింత

సామాజిక భద్రతా కోడ్

ఈ కోడ్ అమల్లోకి వస్తే ఈ కింది చట్టాలు రద్దవుతాయి.

1) ఉద్యోగుల నష్టపరిహార చట్టం- 1923
2) ఉద్యోగుల రాజ్య బీమా చట్టం 1948 (ఈఎస్ఐ)
3) ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్. ఇతర నిబంధనల చట్టం - 1952
4) ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్లు (ఖాళీల తప్పనిసరి నోటిఫికేషన్) చట్టం - 1959
5) ప్రసూతి ప్రయోజన చట్టం - 1961
6) గ్రాట్యూటీ చెల్లింపు చట్టం - 1972
7) సినీ కార్మికుల సంక్షేమ నిధి చట్టం - 1981
8) భవన, ఇతర నిర్మాణ కార్మికుల సెస్ చట్టం - 1996
9) అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రతా చట్టం 2008

కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలరద్దు.
మోడీ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలపై పోరాటమే హద్దు.
దుర్మార్గపు లేబర్ కోడ్లు వద్దే వద్దు



ఎర్రజెండా తోరణాలతో ముస్తాబైన విశాఖ నగరంలోని ఎల్ఐసి డివిజన్ కార్యాలయ సమీపంలోని కూడలి



విశాఖ జిల్లా తగరపువలసలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ వద్ద కార్మికులు


కార్మిక పండగకు విశాఖ ముస్తాబు

31 నుంచి జనవరి 4 వరకూ సిఐటియు అఖిల భారత మహాసభ

27 నుంచి 2 వరకూ శ్రామిక ఉత్సవ్

ప్రారంభ వేడుకకు హాజరుకానున్న ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్

విశాఖ వీధుల్లో ఎర్రజెండాల రెపరెపలు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కార్మిక పండగకు విశాఖ ముస్తాబవుతోంది. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖ ఆర్‌కె బీచ్‌లోగల ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న నేపథ్యంలో విశాఖలో సందడి వాతావరణం నెలకొంది. నగర వీధుల్లో ఇప్పటికే ఎర్ర జెండాలు రెపరెపలాడుతున్నాయి. ప్రధాన కూడళ్లు ఎరుపుమయంగా మారాయి. ఉమ్మడి విశాఖ జిల్లా అంతటా పండగ వాతావరణం నెలకొంది.

హలో కార్మికా.. చలో విశాఖ

మహాసభ సన్నద్ధకంగా ఈ నెల 27 నుంచే సాగర తీరంలో శ్రామిక ఉత్సవ్ ప్రారంభం కానుంది. ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు, బుక్ ఫెస్టివల్, కవులు, రచయితలతో చర్చా గోష్టులు, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు, కార్టూన్, ఫొటో, సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఉండనున్నాయి. సిఐటియు మహాసభ చివరి రోజైన జనవరి నాలుగున భారీ బహిరంగ సభ విశాఖ పోర్టు ఏరియాలోగల ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. సిఐటియు అగ్ర నాయకులు హాజరై ప్రసంగించనున్నారు. మహాసభ, శ్రామిక ఉత్సవ్ వేదికలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రతి రోజూ ప్రత్యేకమే...

సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి వారం రోజులపాటు ఆర్‌కె బీచ్‌లోగల ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుకన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'శ్రామిక్ ఉత్సవ్' జరగనుంది. ప్రతి రోజూ ఉదయం పది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. సాంస్కృతిక, కళా ప్రదర్శనలు అలరించనున్నాయి.



విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన ఏర్పాటు చేసిన మహాసభ పైలాన్

రానున్న సినీ ప్రముఖులు

27న సాయంత్రం 4.30 గంటలకు శ్రామిక ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ హాజరు కానున్నారు. సినీ స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్, సీనియర్ జర్నలిస్ట్ వివి.రమణమూర్తి పాల్గొంటారు. ఈ శ్రామిక ఉత్సవ్‌ను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించనున్నారు. సభాధ్యక్షులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ వ్యవహరించనున్నారు. అనంతరం గుజరాత్ బృందం గర్బా నృత్య ప్రదర్శన ఉంటుంది. జాలరి నృత్యం, రేలారే జానకిరాం పాటలు, కథక్ నృత్యం, ఓ భార్య-ఓ భర్త నాటిక, బొమ్మలాట నాటిక, ప్రముఖ గాయనీ గాయకులచే పాటలు, నృత్యాలు ఉంటాయి. 28న ఆదివారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి ప్రజాకవి, గాయకుడు గోరేటి వెంకన్న, విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్, కళాపోషకులు దాడి సత్యనారాయణ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించనున్నారు. సభ అనంతరం పలు వినోదాత్మక, విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు ఉంటాయి. డ్రగ్స్ అనర్థాలపై నెల్లూరి వారి నాటిక ఉంటుంది. 29న ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరవుతారు. ఈ సందర్భంగా జరిగే సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. సినీ దర్శకులు ఆర్.యాద్ కుమార్, విశాఖ బుల్లయ్య కాలేజీ కరస్పాండెంట్ మధుకుమార్ హాజరు కానున్నారు. 30న సినీనటుడు, నిర్మాత, మా అసోసియేషన్ ఉపాధ్యక్షులు మాదాల రవి, బహుభాషా నటి, తమిళనాడు అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షురాలు రోహిణి హాజరవుతారు. ఈ సందర్భంగా జరిగే సభకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అధ్యక్షత వహిస్తారు. అనంతరం సాంస్కృతిక, కళా ప్రదర్శనలు ఉంటాయి. 31న సినీ దర్శకులు బాబ్జీ, జనవరి ఒకటిన సినీ నటుడు, దర్శకుడు సత్యారెడ్డి, రెండున ప్రఖ్యాత తమిళ సినీ దర్శకులు రాజు మురుగన్, సినీ దర్శకులు అట్టాడ సృజన్ హాజరవుతున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి అధ్యక్షత వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై శ్రామిక ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

మహాసభ జయప్రదానికి తరలండి

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. జివిఎంసి పదవ వార్డు పరిధి రవీంద్రనగర్ బస్టాపు వద్ద శ్రామిక ఉత్సవ్ ఆటో ప్రచార జాతాను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ప్రారంభించారు. కార్మిక వర్గాన్ని భాగస్వామ్యం చేసేందుకు ఈ నెల 27 నుంచి జనవరి రెండు వరకు ఎయు హైస్కూల్ మైదానంలో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు సాయంత్రం ఎయు హైస్కూల్ మైదానంలో శ్రామిక ఉత్సవ్‌ను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్ హాజరవుతారని చెప్పారు. తగరపువలస బైపాస్ రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద కార్మిక పోరాట ఘట్టాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ప్రజలు, కార్మికులు ఆసక్తిగా తిలకించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని క్రెబ్స్ కంపెనీ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు.

పుస్తక మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

విశాఖలో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే విశాఖ పుస్తక మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను డిఇఒ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక మహోత్సవం నిర్వహణ ఉద్దేశం, లక్ష్యాలను డిఇఒకు నిర్వాహకులు వివరించారు.



పుస్తక మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తదితరులు

మహాసభ ఆవశ్యకతను చెబుతూ.. ముందుకు సాగుతూ..

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నిజాంవలీ కాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తూ మహాసభ ఆవశ్యకతను తెలియజేస్తూ ముందుకు సాగారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బిడి కార్మికుల నుంచి ఆర్థిక సాయం సేకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ప్రచార కరపత్రాన్ని ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. సిఐటియు ఏలూరు జిల్లా కార్యాలయంలో మహాసభ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.



శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నిజాం వలీ కాలనీలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68